పోలేరమ్మా.. చల్లగా చూడమ్మా

- భక్తజన సంద్రంగా వెంకటగిరి
- వైభవంగా అమ్మవారి ఊరేగింపు.. విరూపోత్సవం


విశేష అలంకరణలో అమ్మవారు


ఆలయం వద్ద క్యూలైన్లో భక్తులు


ఊరేగింపును వీక్షిస్తున్న జనం


మట్టి కోసం భక్తులు, పోలీసుల పోటీ


పోలేరమ్మ దర్శనానికి వస్తున్న యువరాజా సర్వజ్ఞ యాచేంద్ర





వెంకటగిరి, న్యూస్‌టుడే: రాష్ట్ర పండుగైన వెంకటగిరి పోలేరమ్మ జాతర అశేష భక్తజన సందోహం మధ్య గురువారం వైభవంగా జరిగింది. ఊరేగింపులో వీధులన్నీ భక్తులతో నిండాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సారె సమర్పించారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మొక్కులు చెల్లించారు.

నిజరూప దర్శనం: గురువారం వేకువజామున అత్తగారింటి నుంచి పోలేరమ్మను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం వద్ద దర్శనార్థం ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని నిజరూపంలో దర్శించుకున్నారు. సాయంత్రం ప్రత్యేక పూల రథంపై అమ్మణ్ణిని అధిష్ఠించి మేళతాళాల మధ్య ఊరేగింపు వైభవంగా సాగింది. సాయంత్రం ఆలస్యంగా 5.30 గంటలకు ఊరేగింపు ప్రారంభమైంది. విద్యుత్తు సరఫరా నిలిపేయడంతో చీకట్లో శోభాయమానంగా సాగింది. అనంతరం విరూపోత్సవ మండపానికి రాత్రి 7.55 గంటలకు అమ్మవారు చేరుకున్నారు. విరూపణ చేయడంతో జాతర ముగిసింది. అమ్మవారి మట్టి తీసుకునేందుకు భక్తులు భారీగా పోటీ పడ్డారు.


సారె సమర్పించేందుకు వస్తున్న మంత్రులు కందుల దుర్గేష్, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి


బూరలు ఊదుతున్న మహిళలు


ఆనకట్ట గేట్ల కింద లీకేజీ

పాలచ్చూరు ఆనకట్టకు ముప్పు

లీకేజీలతో పొంచి ఉన్న ప్రమాదం


బాడీ వాల్‌కు లీకులు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి మండలాలకు సాగునీరందించే పాలచ్చూరు ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉంది. కలవకూరు వద్ద స్వర్ణముఖి నదిపై నిర్మించిన ఆనకట్ట మూడు గేట్లు దెబ్బతిని లీకవుతున్నాయి. నది మొత్తంగా నిర్మించిన ఆనకట్టది ఇదే పరిస్థితి కాగా ఐదేళ్లలో చిల్లిగవ్వ మరమ్మతులకు వెచ్చించలేదు. దీంతో కట్ట బలహీన పడగా నీటిని వదిలే గేట్లు, నీటి ప్రవాహం బెడ్లు దెబ్బతిన్నాయి. ఇవన్నీ మరమ్మతు చేయడానికి రూ.కోట్లలో వెచ్చించాల్సి రావడంతో పాలకులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఏఈ మహేష్‌ని వివరణ కోరగా.. బాడీ వాల్‌కి స్టీల్‌తో మరమ్మతులు చేయడానికి రూ.3 కోట్లకు ప్రతిపాదనలు గతంలో పంపినట్లు తెలిపారు.

కోర్సులు లేకనే రూ.కోట్లలో చెల్లింపులు

- ఐదేళ్లలో అభ్యసన సామగ్రికి లెక్కాపద్దు
- ఎస్వీయూ దూరవిద్య విభాగం తీరిది


ఎస్వీయూలోని ప్రింటింగ్ ప్రెస్

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: అక్కడ ప్రవేశాలు లేవు.. అప్పటికే కోర్సులో చేరిన కొందరికి పరీక్షలు జరగనే లేదు.. పేరుకే తరగతులు తప్ప.. వాటి ఆచూకీ కనిపించిన దాఖలాలు లేవు.. ఆ తర్వాత ఆ కోర్సులు రద్దయినా స్టడీ మెటీరియల్ ఇతరత్రా ప్రింటింగ్ ఖర్చుల కింద రూ.కోట్లలో చెల్లించేశారు.

పేరు గొప్పలా ఎస్వీయూ దూరవిద్య విభాగం పరిస్థితి ఉంది.. ఐదు విభాగాల్లో డిగ్రీ మూడేళ్ల కోర్సులు, పీజీ కోర్సుల్లో 19 విభాగాలున్నాయి. గత పాలకుల చేతకానితనంతో విభాగం నేడు మూతపడే స్థాయికి చేరింది. యూజీసీ నిబంధనలు పాటించకపోవడంతో 2022 నుంచి ఇప్పటివరకు ఆ విభాగంలో ప్రవేశాలు లేవు. ప్రస్తుతం ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లోని డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఈ ఏడాది మార్చిలో పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా వాటి ఊసేలేదు. అయితే విద్యార్థులకు కోర్సు మెటీరియల్స్ ఇచ్చేశామని, ప్రైవేటు ప్రింటింగ్ ప్రెస్‌కు ఐదేళ్ల వైకాపా పాలనలో దాదాపు రూ 5.5 కోట్లు చెల్లించినట్లు సమాచారం. ఈ నెల 20న జరిగిన పాలక మండలి సమావేశంలో చర్చించి రూ.1,09,43,323లను మంజూరు చేసేశారు.

లెక్కలేవీ అంటున్న విద్యార్థులు

ఆర్థిక లోటుతో కొట్టుమిట్టాడుతున్న వర్సిటీలో ప్రైవేటు ప్రింటింగ్ ఖర్చుల పేరుతో డబ్బులు దోచిపెడుతున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అభ్యసన పుస్తకాలు (స్టడీ మెటీరియల్) ఎంత ప్రింట్ చేశారు.. ఎంతమందికి ఇచ్చారనే లెక్కలు లేవని విమర్శిస్తున్నారు.

సొంత ప్రింటింగ్ ప్రెస్ ఉన్నా..

వర్సిటీకి ప్రాంగణంలో సొంతంగా ఓ ప్రింటింగ్ ప్రెస్ ఉండగా ఇద్దరు ఉద్యోగులతో వర్సిటీలోని కొన్ని విభాగాల పరీక్షల పేపర్లను మాత్రమే అందులో ముద్రిస్తున్నారు. ఆయా విభాగాలకు స్టేషనరీ, ఇతర మెటీరియల్ పెద్దఎత్తున అవసరమున్నా ప్రెస్ నవీకరణపై దృష్టిసారించడం లేదు. బయటి ప్రింటర్లపై ఆధారపడి నిధులు ఇష్టానుసారం చెల్లించేస్తున్నారు.

ఇక నుంచి ఆన్‌లైన్ మెటీరియల్ వినియోగం

ప్రైవేటు ప్రింటర్స్ గతంలో దూరవిద్య విభాగానికి మెటీరియల్ సరఫరా చేయడంతో సంబంధిత బిల్లులు ఇటీవల చెల్లించాం. ఇకనుంచి దూరవిద్య విభాగ విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో పాఠ్యాంశాలకు సంబంధించిన అన్ని అంశాలను పొందుపరుస్తాం. ప్రింటింగ్ చేసి ఇచ్చే విధానానికి స్వస్తి పలుకుతున్నాం. దూరవిద్య ప్రవేశాల పునఃప్రారంభంపై ఇటీవలే దిల్లీ వెళ్లివచ్చాం. **- ఆచార్య భూపతి నాయుడు, రిజిస్ట్రార్**

ఇద్దరు ఆర్డీవోల నియామకం

తిరుపతి (కలెక్టరేట్): శ్రీకాళహస్తి, సూళ్లూరుపేటకు కొత్తగా ఆర్డీవోలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి స్థానంలో భానుప్రకాష్‌రెడ్డిని నియమించారు. సూళ్లూరుపేటలో పనిచేస్తున్న చంద్రమునిని ప్రభుత్వ కార్యదర్శి వద్ద రిపోర్టు చేయాలంటూ ఆదేశించారు. ఆయన స్థానంలో ఎన్టీఆర్ జిల్లాలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఈతమాకుల కిరణ్మయి నియమితులయ్యారు. గూడూరు ఆర్డీవోగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ స్థానంలో ఐఏఎస్ రాఘవేంద్ర మీనాను సబ్‌కలెక్టర్‌గా ఇటీవల ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసింది. తిరుపతి ఆర్డీవో పోస్టుకు పోటీ నెలకొన్న నేపథ్యంలో ప్రస్తుతానికి ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది.

'ఫ్రీ'గా కొట్టేసేందుకు వైకాపా నేతల యత్నం..!

- 1,914.41 ఎకరాలకు కలెక్టర్ ప్రొసీడింగ్స్ లేకుండానే హక్కు

శ్రీకాళహస్తి మండలం రెవెన్యూ గ్రామాలు : 67

మొత్తం అసైన్డ్ భూములు : 14390.77 ఎకరాలు

62 గ్రామాల పరిధిలో ఫ్రీహోల్డ్ చేసినవి: 9316.98 ఎకరాలు

కలెక్టర్ ప్రొసీడింగ్స్ లేకుండా ఫ్రీహోల్డ్ చేసినవి: 1914.41 ఎకరాలు

నిబంధనలు అతిక్రమించి ఫ్రీహోల్డ్ చేసినవి: 69.01 ఎకరాలు



ఈనాడు-తిరుపతి: 'ఫ్రీహోల్డ్' పేరుతో నిబంధనలు అతిక్రమించి వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు భూములు కొట్టేశారని అధికారుల పరిశీలనలో స్పష్టమైంది. కలెక్టర్ ప్రొసీడింగ్స్ లేకుండానే ఏకంగా 1914.41 ఎకరాలు ఫ్రీహోల్డ్ చేశారు. మరోవైపు రెవెన్యూ అధికారులు వైకాపా నేతలతో కుమ్మక్కైన కారణంగా వీటితోపాటు ఇప్పటికే రిజిస్ట్రేషన్లు జరిగిన వాటిలో రెవెన్యూ తప్పిదం వల్ల 49 దస్త్రాల లావాదేవీలు జరిగినట్లుగా అధికారులు గుర్తించారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపించారు.

భూముల ఫ్రీహోల్డ్ అంశమై కూటమి ప్రభుత్వం ప్రతి జిల్లాలోనూ ఒక మండలాన్ని ఎంపిక చేసి క్షేత్రపరిశీలన చేసి నివేదిక పంపాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. దీనికి అనుగుణంగా తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి మండలాన్ని ఎంపిక చేశారు. ఆపై ఆర్డీవో నేతృత్వంలోని బృంద సభ్యులు ఆ మండలంలో జరిగిన భూముల ఫ్రీహోల్డ్‌ను పరిశీలించి పలు అక్రమాలను గుర్తించారు.

గుర్తించిన అంశాలివీ..

- సీసీఎల్ఏ ఇచ్చిన ఆదేశాల మేరకు బృందం సభ్యులు అన్ని దస్త్రాలను పరిశీలించారు. మొత్తం 33 గ్రామాల పరిధిలోని 577.38 ఎకరాలకు సంబంధించి 418 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికారులు గుర్తించారు.
- నిబంధనలు అనుసరించి 369 లావాదేవీలు జరిగాయి. ఇందులో 284 సేల్‌డీడ్, 80 గిఫ్ట్ డీడ్, ఐదు మార్టిగేజ్ డీడ్ చేశారు.
- మిగిలిన 69.01 ఎకరాల అసైన్డ్ భూమి పరిశీలిస్తే 49 లావాదేవీలకు సంబంధించి రెవెన్యూ అధికారులు నిబంధనలు అతిక్రమించి భూములకు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు. దీనివల్ల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తేల్చారు.
- వీటిల్లో నాలుగు లావాదేవీలు 22ఏని తొలగిస్తున్నామని పేర్కొంటూ ఇచ్చిన ప్రొసీడింగ్స్.
- 45 లావాదేవీలు వీఆర్వో/తహసీల్దార్లు ఆయా భూములు 2003 ముందు ఇవ్వకున్నా ఇచ్చినట్లుగా పేర్కొంటూ వెబ్‌ల్యాండ్‌లో పొందుపర్చి ఫ్రీహోల్డ్ చేసినవిగా కనుగొన్నారు.
- రికార్డులను పరిశీలిస్తే చాలా వరకు భూములు ఓసీయేతరుల నుంచి ఓసీలకు మార్పు చెందినట్లు గుర్తించారు.

రిజిస్ట్రేషన్లు జరగకున్నా..

- రిజిస్ట్రేషన్లు జరుగకుండా ఉన్న వాటికి సంబంధించి ప్రాథమిక పరిశీలన మేరకు 291 అనర్హత రికార్డులు ఉన్నట్లుగా గుర్తించారు.
- 221 అభ్యంతరకరమైన పోరంబోకు భూములు, 70 రికార్డులు 2004 తర్వాత అసైన్‌లో పొందుపర్చినట్లు తేల్చారు.
- ఇంకా క్షేత్రస్థాయిలో పరిశీలనతోపాటు రికార్డుల తనిఖీ జరుగుతోంది. ఇది పూర్తయితే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే ఆస్కారం ఉంది.

అక్రమంగా లేఅవుట్ నిబంధనలు హాంఫట్..

- పంట కాలువలు, వాగులు పూడ్చి నిర్మాణాలు
- కొనసాగుతున్న వైకాపా నేతల స్థిరాస్తి దందా

నాయుడుపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కూడా గూడూరు, సూళ్లూరుపేట డివిజన్లల్లో వైకాపా నాయకులు అక్రమ రియల్ వ్యాపారం దందా కొనసాగిస్తున్నారు. పంట కాలువలు, వాగులు పూడ్చేసి అక్రమంగా లేఅవుట్లలో కలిపేసుకుంటున్నారు. కొన్నిచోట్ల వాగులకు అడ్డంగా రోడ్లు, ప్రహరీలు నిర్మిస్తున్నారు. దీంతో వర్షాల సమయంలో వరద సాఫీగా వెళ్లే అవకాశం లేకపోతోంది. ఎక్కడికక్కడ పొలాలు, గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి.


యాకసిరి వద్ద వాగుకు అడ్డంగా రోడ్డు వేసి లేఅవుట్‌కు అనుసంధానంగా ఏర్పాటు చేసిన దారి

వాగుకు అడ్డంగా మట్టి రోడ్డు

నాయుడుపేట పట్టణానికి అతి దగ్గరలో ఉన్న చిట్టమూరు మండలం యాకసిరి రెవెన్యూ పరిధిలో చెరువు దగ్గర కొందరు నాయకులు కలిసి 29 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. పక్కనే ఉన్న చెరువు నుంచి వరద వెళ్లే ప్రధాన వాగుకు అడ్డంగా లేఅవుట్‌కు అనుసంధానంగా జలవనరుల శాఖ అనుమతులు లేకుండా మట్టిరోడ్డు నిర్మించారు. ఈ ప్రాంతంలో ఉన్న నరసారెడ్డికండ్రిగ, పెరికిలింపాటికండ్రిగ, యాకసిరి, కమ్మవారిపాళెం, మిట్టకండ్రిక, అత్తలపాళెం, పుదూరు గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు అధిక విస్తీర్ణంలో వెంచర్ కనిపిస్తున్నా 29 ఎకరాల్లో మాత్రమే భూమార్పిడి చేసుకోవడం సందేహాలకు తావిస్తోంది.

తేడా ఉంటే అనుమతివ్వొద్దు

- చంద్రముని ఆర్డీవో సూళ్లూరుపేట

భూమార్పిడి సమయంలో రికార్డులు సరిగా ఉన్నాయా లేదా అన్నది రెవెన్యూ శాఖ పరిశీలన చేస్తుంది. అనుమతులు జారీ చేసే ముందు పట్టణాభివృద్ధి సంస్థలు కాలువలు, వాగులు పూడ్చకుండా చూసుకోవాలి. తేడా ఉంటే అనుమతులు ఇవ్వకూడదు.

- చిట్టమూరు మండలం యాకసిరి చెరువు వాగుకు అడ్డంగా వేసిన రోడ్డు నిర్మాణం గురించి తహసీల్దారు ప్రసాద్‌ను వివరణ కోరగా.. తమకు సంబంధం లేదని, జలవనరుల శాఖ చూసుకొంటుందన్నారు.

ప్రహరీ నిర్మాణంతో రాకపోకలు సాగించలేక

పెళ్లకూరు మండలం శిరసనంబేడు వద్ద 80 ఎకరాలను పేదలు నుంచి తక్కువ ధరకు కొని భారీ లేఅవుట్ వేశారు. పంట కాలువలు, ఎండ్లబండి దారిగా ఉన్న రోడ్డు లేఅవుట్ భూముల్లో కలుపుకోవడంపై చిన్న సన్నకారు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ నిర్మించడంతో ఎగువ భాగంలోని శిరసనంబేడు ప్రాంతం నుంచి వరద సాఫీగా వెళ్లే అవకాశం లేకుండా ఉంది. ఈ ప్రాంతంలో ఉన్న ఎండ్లబండ్ల బాటను కూడా కలుపుకోవడంతో శిరసనంబేడు, కానూరు తాళ్వావాయిపాడు గ్రామాల ప్రజలకు శిరసనంబేడుకు రాకపోకలు సాగించేందుకు అవకాశం లేకుండా పోయింది. తాళ్వావాయిపాడు రెవెన్యూలో స్వర్ణముఖి తీరంలో నది పోరంబోకు భూముల్లో గోడలు నిర్మించి ప్లాట్లుగా సిద్ధం చేశారు.

- నాయుడుపేట మండలం అయ్యప్పరెడ్డి సమీపంలో మామిడి కాలువ పక్కనే అక్రమంగా లేఅవుట్ వేశారు. కాలువకు వరదొస్తే ఈ ప్రాంతం పూర్తిగా మునుగుతుంది. వీటిని పరిశీలనలోకి తీసుకోకుండా నివాస స్థలాల కింద లేఅవుట్‌కు రెవెన్యూ అధికారులు భూమార్పిడి అనుమతులు ఇవ్వడంపై విమర్శలు వస్తున్నాయి. మేనకూరు వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన వ్యాపారులు అనుమతులు లేకుండా లేఅవుట్ల చుట్టూ గోడలు నిర్మించారు.

జగన్‌కు అలిపిరి దాటే అర్హత ఎక్కడిది?

సాధుపరిషత్

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జగన్ తిరుమల పర్యటనకు వచ్చే సాహసాన్ని మానుకోవాలని, ఓ క్రిస్టియన్ రూపంలో ఉన్న ఆయనకు శ్రీవారి చెంతకువచ్చే అర్హత ఏమాత్రం లేదని సాధువులు, హిందూ సంఘాల నేతలు హెచ్చరించారు. గురువారం గరుడ కూడలి వద్ద రాష్ట్ర సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి తదితరుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. హిందూ వ్యతిరేకవాదిగా ముద్రవేసుకున్న జగన్‌మోహన్ రెడ్డికి అలిపిరి దాటే అర్హత లేదన్నారు. ఆయన తిరుమలకు రావాలనుకుంటే తమ శరీరాలు దాటి వెళ్లాలని తీవ్రంగా హెచ్చరించారు. ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలో 250 ఆలయాలను నేలకూల్చారని, అంతర్వేదిలో రథానికి నిప్పు పెట్టారని, బెజవాడ దుర్గమ్మ గుడిలో చోరీలకు పాల్పడ్డారని.. దొంగల ముఠా వంటి జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేసిందని దుయ్యబట్టారు. ఆయన బంధువులే దేవస్థానం ఛైర్మన్లుగా, పాలకమండలి సభ్యులుగా, ముఖ్య అధికారులుగా అన్ని విభాగాల్లో పనిచేసి తితిదేను దోచుకున్నారని ఆరోపించారు. ఓంకార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



అలిపిరి వద్ద సాధువులు, హిందూ సంఘాల నేతల ధర్నా

అప్పుడెందుకు ప్రాయశ్చిత్తం చేసుకోలేదు?

- చిన్నాన్న డిక్లరేషన్ ఎత్తేస్తే.. జగన్ ఇప్పుడిస్తారట
- తెలంగాణ భాజపా నేత మాధవీలత

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో లడ్డూప్రసాదం తయారీకి వాడే నెయ్యి బాగోలేదని 18 సార్లు వెనక్కు పంపామని చెప్పిన జగన్ సంబంధిత నివేదిక ఎక్కడుందో చెప్పాలి.. అప్పుడు ప్రాయశ్చిత్తం ఎందుకు చేసుకోలేదు. అప్పుడు శ్రీవారి మెట్లు ఎందుకు ఎక్కలేదు' అంటూ తెలంగాణ భాజపా నాయకురాలు మాధవీలత ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీతోపాటు దానికి అనుబంధంగా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తిరుమల పవిత్రను దెబ్బతీస్తున్నారని, ఇప్పటికైనా హిందువులు మేల్కొనాలని పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం శ్రీవారి మెట్టుమార్గంలో భజనలు చేసుకుంటూ ఆమె తిరుమల చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. శ్రీవారికి భక్తులు నిలువుదోపిడీ ఇస్తుంటే కొందరు నాయకులు మాత్రం స్వామివారినే నిలువుదోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో స్వామివారి వజ్రాలు పోయాయని, ఇప్పుడు కల్తీ నెయ్యితో నైవేద్యాలు పెట్టారని ఆరోపించారు. 2020 సెప్టెంబర్ 20న శ్రీవారి ఆలయంలోకి అన్యమతస్థులు ప్రవేశించేందుకు ఇచ్చే డిక్లరేషన్ విధానాన్ని చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి ఎత్తివేస్తే.. ఇప్పుడు తిరుమలకు వచ్చి స్వామివారిని దర్శించుకునేందుకు డిక్లరేషన్‌పై సంతకం చేస్తానంటూ మభ్యపెట్టడం ఎందుకని జగన్‌ను ప్రశ్నించారు.


శ్రీవారి మెట్టుమార్గంలో నడిచివస్తున్న మాధవీలత


తితిదే ఈవో శ్యామలరావుతో మాట్లాడుతున్న భానుప్రకాశ్‌రెడ్డి

డిక్లరేషన్‌పై సంతకం చేశాకే అనుమతించాలి

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్‌ని హిందూ ధర్మంపై విశ్వాసం ఉందని డిక్లరేషన్‌పై సంతకం పెట్టిన తర్వాతనే తిరుమల కొండపైకి అనుమతించాలని భాజపా నేతలు డిమాండ్ చేశారు. గురువారం తితిదే పరిపాలన భవనంలో ఈవో శ్యామలరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. జగన్ హిందూ వ్యతిరేకశక్తని, హిందువులపై అభిమానం ఏనాడూ చూపలేదని, రాజకీయ లబ్ధి కోసమే తిరుమల పర్యటనకు విచ్చేస్తున్నారని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో తితిదేని అవినీతిలో ముంచేశారని, వందల కోట్ల దోపిడీ జరిగిందని, లడ్డూల తయారీలోనూ పాపాలకు ఒడిగట్టారని విమర్శించారు. నాయకులు భానుప్రకాశ్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, పొనగంటి భాస్కర్, అజయ్ కూమార్, వరప్రసాద్, పెనుబాల చంద్రశేఖర్, డా.శ్రీహరిరావు, డా.నరేష్, మల్లకుప్పం శేఖర్, శరత్ కూమార్, దయానంద్, కిట్టు రాయల్ పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీసు యాక్ట్ అమలు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈనెల 25 నుంచి అక్టోబరు 24 వరకు యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ఏదైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేయాలంటే లిఖితపూర్వకంగా పోలీసులకు అర్జీలు సమర్పించి.. అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అనుమతులు లేకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీల నాయకులు, సంస్థలు, సమూహాలు, ప్రజలు పోలీసువారి ఉత్తర్వులను పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.



శ్రీవారి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బ్రహ్మోత్సవ సుందరీకరణ



ఎల్ఈడీ దీపాలతో శ్రీవారి ప్రతిమ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సన్నిధి బ్రహ్మోత్సవ శోభను సంతరించుకుంటోంది. వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుంచి 12 వరకు జరగనున్న నేపథ్యంలో సుందరీకరణ పనులు శరవేగంగా పూర్తిచేస్తున్నారు. ఉద్యాన వనశాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల పుష్పాలు, పండ్లతో ప్రత్యేకంగా వివిధ దేవతామూర్తులు, వారి వాహనాలను తీర్చిదిద్దుతున్నారు.



సీతా స్వయంవరం ఘట్టంతో రూపొందుతున్న సెట్టింగ్ ముందు ఇలా..

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎటువంటి దర్శన టికెట్లు లేకుండా గురువారం సాయంత్రానికి తిరుమల వచ్చిన భక్తులకు దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. బుధవారం శ్రీవారిని 77,939 మంది దర్శించుకున్నారు. రూ.3.50 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

విపణిలోకి ఎంజీ విండర్స్ విద్యుత్తు వాహనం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: నగర మార్కెట్‌లోకి ఎంజీ విండర్స్ ఎలక్ట్రికల్ వాహనం అందుబాటులోకి వచ్చింది. గురువారం స్థానిక ఎంజీ షోరూమ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీవో మురళీమోహన్ వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం అధినేత ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ వాహనానికి జీవిత కాలం వారంటీ ఉంటుందన్నారు. కొనుగోలుదారుల అభిరుచులకు అనుగుణంగా వాహనాన్ని ఎంజీ సంస్థ రూపొందించిందన్నారు. ఒకసారి రీఛార్జ్ చేస్తే దాదాపు 331 కిలో మీటర్లు నడుస్తుందని వివరించారు. ఈడీ చందన్, సీఈవో మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంజీ విండర్స్ వాహనం ఆవిష్కరణలో ఆర్టీవో మురళీమోహన్, షోరూమ్ అధినేత ఉదయ్‌కుమార్

పర్యాటకానికి బాటలు

ఈనాడు డిజిటల్, తిరుపతి- తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: ఐదేళ్లుగా పడకేసిన పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం కొత్త జీవం పోస్తోంది. అధికారంలోకి రాగానే గత పాలకులు నిర్వీర్యం చేసిన పర్యాటక ప్రాంతాలన్నింటినీ వృద్ధిలోకి తెచ్చేందుకు కలెక్టర్ ఛైర్మన్‌గా కమిటీ ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. పీపీపీ విధానంలో పలు రిసార్ట్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. జిల్లాను తిరిగి పూర్తిస్థాయి పర్యాటకంగా తీర్చి దిద్దేందుకు రూ.860 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వానికి నివేదికలు సైతం పంపించారు. 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా కథనం.

రిసార్ట్‌ల ఏర్పాటుకు..

వైకాపా పాలనలో ఒక్క రూపాయి కూడా జిల్లా పర్యాటకానికి విడుదల చేయలేదు. కనీసం ఆ శాఖకు ఖాతా పుస్తకం లేకపోవడం విస్మయం కలిగిస్తోంది. 2015లో మాత్రమే స్థానిక పర్యాటకాభివృద్ధి పేరుతో నిధులు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్యాటకం మీద ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. అందులో భాగంగానే తూపిలిపాలెం బీచ్ వద్ద 20 ఎకరాలతో రిసార్ట్, మల్లెమడుగు సమీపంలో 99 ఎకరాలతో మరో రిసార్ట్ ఏర్పాటుకు స్థలసేకరణ పనులు జరుగుతున్నాయి. పీపీపీ విధానంలో మూడు ఎకరాల్లో హోటల్ నిర్మాణానికి చంద్రగిరి, రామచంద్రాపురం ప్రాంతాల్లో అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నారు. పాక్షికంగా ధ్వంసమైన పర్యాటక ప్రాంతాల్లో ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు.



తలకోన జలపాతం

ఆరేళ్ల తరువాత తిరిగి

రాయల రాజసానికి ఆనవాలుగా ఉన్న చంద్రగిరి కోట 2018లో పిడుగుపాటుకు గురైనప్పటినుంచి పర్యాటకంగా అంతంత మాత్రమే నిలిచింది. తిరిగి కోటకు పూర్వ వైభవం తెచ్చేలా పర్యాటక శాఖ కసరత్తులు ప్రారంభించింది. పీపీపీలో భాగంగా లక్స్ అండ్ డెసిబుల్స్ అనే సంస్థకు ఆధునీకీకరణ పనులు అప్పగించారు. అందులో భాగంగా పర్యాటక దినోత్సవం సందర్భంగా రూ.6 కోట్లతో తిరిగి సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్ పునరుద్ధరించి, పర్యాటకులకు అందుబాటులోకి తేనున్నారు. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) బోటింగ్, ఫుడ్ కౌంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుంది.

నెల ఆదాయం రూ.3 కోట్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తిరుమలలో ఐదు రెస్టారెంట్లు, హార్సిలీహిల్స్ అండ్ హరిత హిల్ రిసార్ట్, శ్రీకాళహస్తిలోని హరిత రెస్టారెంట్, పులిగుండు, కైలాసకోన, పుత్తూరు సమీపంలో హరిత రిసార్ట్ మొదలైనవి ఏపీటీడీసీ పర్యవేక్షణలో ఉండగా కేవలం ఆగస్టు ఒక్కనెలలోనే 34,663 మంది పర్యాటకులు సందర్శించగా, రూ.3,20,14,161 ఆదాయం రావడం గమనార్హం. కుప్పం, నగరి, పలమనేరు ప్రాంతాల్లో ఉన్న రెస్టారెంట్లను పీపీపీ పద్ధతిలో ఇవ్వడం జరిగింది. జిల్లాలో పర్యాటరంగాన్ని ఆదాయ వనరుగా మార్చేందుకు జిల్లా అధికారులు కృషి చేస్తున్నారు. పురాతన దేవాలయమైన ఏర్పేడు మండలంలోని గుడిమల్లం ఆలయానికి సైతం నేటి నుంచి ఏపీటీడీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయనుంది.

ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కావాల్సిన నిధులు

ప్రాజెక్ట్ పేరు	నిధులు (రూ.కోట్లలో)
తలకోన (కారవ్యాన్, ట్రెక్కింగ్, ఎకో టూరిజం)	27
కైలాసకోన (రిసార్ట్, ట్రెక్కింగ్, కారవ్యాన్, ఎకో టూరిజం)	30
మామండూర్ (కారవ్యాన్, టూరిజం)	22
కల్యాణి డ్యాం (రిసార్ట్, టూరిజం)	32
మల్లెమడుగు (రిసార్ట్, వాటర్ స్పోర్ట్స్, వెల్‌నెస్ సెంటర్)	100
జూపార్క్ (జంగిల్ సఫారీ)	75
మొనపాలెం బీచ్ (రిసార్ట్ , వాటర్ స్పోర్ట్స్)	50
చంద్రగిరికోట (ట్రెక్కింగ్, కారవ్యాన్, హెరిటేజ్ టూరిజం)	12
శ్రీకాళహస్తి (టెంపుల్ టౌన్ అభివృద్ధి, భక్తకన్నప్ప కొండకు రోప్‌వే)	115
తుపిలిపాలెం (బీచ్ రిసార్ట్, వాటర్ స్పోర్ట్స్)	36



ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఉన్న హార్సిలీహిల్స్ ప్రాంతంలో పర్యాటకులు

మంత్రి చొరవతో పర్యాటక సమస్యలకు పరిష్కారం.. తిరుపతి డివిజన్ ఆదాయం పరంగా స్థిరంగా ఉన్నప్పటికీ పర్యాటకరంగ విస్తరణ జరగాలని మంత్రి కందుల దుర్గేశ్ ఇటీవల సమీక్షలో వెల్లడించారు. అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కొన్ని ప్రతిపాదనలు అందజేశాం. మరికొన్ని సిద్ధమవుతున్నాయి. తిరుమలలో పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు, తలకోన, హార్సిలీహిల్స్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం.
- గిరిధర్‌రెడ్డి, డీవీఎం, తిరుపతి డివిజన్

పుట్టగొడుగుతో.. ఉపాధి మొగ్గతొడిగేలా

✷ మహిళా వర్సిటీలో ప్రత్యేక శిక్షణ ✷ సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థినులు, మహిళలు

మహిళా వర్సిటీ (తిరుపతి), న్యూస్‌టుడే: నైపుణ్యం.. స్వయం ఉపాధి శిక్షణకు చదువుల ఒడి వేదికవుతోంది. మహిళలు, విద్యార్థినులకు వారికి నచ్చిన రంగాల్లో ప్రత్యేక శిక్షణనిచ్చి వ్యాపారవేత్తలుగా తయారు చేసేందుకు శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో ప్రత్యేక కేంద్రాలున్నాయి. వీటిద్వారా స్వయం ఉపాధిరంగంలో నిలదొక్కుకొనేలా.. తద్వారా మహిళా సాధికారత సాధించేలా ప్రోత్సహిస్తోంది.

ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో..

కేంద్ర ప్రభుత్వ సహకారంతో వర్సిటీలో నిర్వహిస్తున్న లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్ (ఎల్‌బీఐ) సెంటర్ ద్వారా చిన్నతరహా పరిశ్రమల్లో మహిళలకు పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో అవకాశాలు కల్పించడం కోసం ఈ కేంద్రం ఏర్పాటైంది. వర్సిటీలోని సెరికల్చర్ విభాగం ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై మూడునెలల సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులో 18 నుంచి 25 సంవత్సరాల వయస్సుగల విద్యార్థినులు, మహిళలు ఇప్పటివరకు 50 మందికిపైగా శిక్షణ పొందారు. బటన్, ఆయిస్టర్, మిల్కీ మష్రూమ్ కోర్సులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 28 మంది వర్సిటీ విద్యార్థినులు శిక్షణ తీసుకుంటున్నారు. వీరికి తరగతులు లేని సమయంలో, సెలవు రోజుల్లో శిక్షణ ఇస్తున్నారు. అనంతరం మార్కెటింగ్, రుణ సదుపాయంపై మార్గదర్శనం చేస్తున్నారు.



శిక్షణలో విద్యార్థినులు, డీన్ సుజాత

నెల రోజుల్లోనే దిగుబడి



నేను ఎమ్మెస్సీ జువాలజీ చదువుతున్నా. మా విభాగంలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇస్తున్నారని తెలిసి చేరా. బయట మార్కెట్లో దొరికే బటన్ రకం కంటే ఆయిస్టర్ రకం చాలా రుచిగా ఉంటుంది. ప్రొటీన్ ఎక్కువగా లభిస్తుంది. నాన్‌వెజ్ తిననివారికి ఎక్కువ ఉపయోగం. మనకు కావాల్సినప్పుడు విత్తనాలు వేసి నెలరోజుల్లోనే ఇంట్లోనే పండించుకోవచ్చు. మాది విజయనగరం. చదువు పూర్తయి మా ఊరికి వెళ్లాక వీటి వ్యాపారం ప్రారంభిస్తా. అక్కడి రైతులకు శిక్షణ ఇస్తా. **- సువర్ణజ్యోతి, విద్యార్థిని**

చదువు పూర్తికాగానే వ్యాపారం



ఆటోక్లేవ్ లేదా ప్రెజర్ కుక్కర్, లామినర్ ఎయిర్‌ఫ్లో, చల్లగా ఉండే చీకటి గదిలో పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టవచ్చు. విత్తనాలు పెట్టిన నెలరోజుల్లో పుట్టగొడుగులు వచ్చేస్తాయి. ఏడాది పొడవునా వీటిని మనం పండించుకోవచ్చు. నేను ఎమ్మెస్సీ జువాలజీ చదువుతున్నా. ఈ ఉపాధి కోర్సు మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. చదువు పూర్తవగానే ఉద్యోగం కోసం వెతికే పనిలేకుండా కొద్దిపాటి ఖర్చుతో ఇంట్లోనే వీటి పెంపకాన్ని ప్రారంభించాలనుకుంటున్నా. **- వాణి, విద్యార్థిని**

నాణ్యత లోపమా.. టిప్పర్ల ఉక్కు పాదమా?



కంకర, గ్రావెల్ అక్రమ రవాణాతో రహదారులు ఛిద్రమవుతున్నాయి. చంద్రగిరి-గంగుడుపల్లి మార్గంలోని దోర్నకంబాల సమీపంలో తారు రోడ్డు పూర్తిగా నెర్రెలిచ్చింది. రామచంద్రాపురం మండలం బొప్పరాజుపల్లి, నెత్తకుప్పం ప్రాంతాల్లోని గుట్టలను కొల్లగొట్టి రాత్రివేళ 20 నుంచి 25 టన్నుల సామర్థ్యంగల టిప్పర్లలో తిరుపతి పరిసర ప్రాంతాల్లోని లే-అవుట్లకు గ్రావెల్ తరలిస్తున్నారని, రాత్రివేళ భారీ వాహనాల రొదతతో నిద్రలులేని రాత్రులు గడుపుతున్నామని, ప్రమాదాలు జరుగుతున్నాయని, మరమ్మతులు చేపట్టాలని పల్లెప్రజలు నివేదిస్తున్నారు.
– న్యూస్‌టుడే, చంద్రగిరి

తెలుగు గంగా ప్రాజెక్టు ఎస్ఈగా శారద

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ఈగా శారద ఒరింపాటిని గురువారం ప్రభుత్వం నియమించింది. కడప జిల్లాలో తెలుగు గంగ ప్రాజెక్టు డిజైన్స్ విభాగం ఎస్ఈగా పనిచేస్తున్న ఆమెను తిరుపతి జిల్లాకు కేటాయించారు.

నేటి నుంచి 'తిరుమల ప్రక్షాళన' పాదయాత్ర

ఈనాడు, అమరావతి: తిరుమల క్షేత్ర పవిత్రత, భక్తుల మనోభావాల పరిరక్షణ లక్ష్యంగా 'తిరుమల ప్రక్షాళన' పేరుతో పాదయాత్ర చేపడుతున్నట్లు భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) అధ్యక్షుడు రామచంద్రయాదవ్ తెలిపారు. ఈ నెల 30న అలిపిరి వద్ద యాత్ర ముగుస్తుందని పేర్కొన్నారు.

ప్రొవిజన్ స్టోర్ యజమాని ఐపీ దాఖలు

తిరుపతి (లీగల్): తిరుపతిలోని ఓ ప్రొవిజన్ స్టోర్ యజమాని రూ.1.10 కోట్లకు తిరుపతి కోర్టులో ఐపీ దాఖలు చేసినట్లు అతని తరపు న్యాయవాది ఐ.సురేంద్ర గురువారం తెలిపారు. పిటిషన్‌లోని వివరాల మేరకు… ఫిర్యాదిదారు తిరుపతి, ఆర్‌సీ రోడ్డులో నివాసం ఉన్న వి.సురేంద్రన్ రెండేళ్లుగా అవిలాల, శానప్పకాలనీలో శ్రీ వినాయక ప్రొవిజన్సు స్టోరు నడిపేవారు. వ్యాపార అభివృద్ధికి ఇతరుల వద్ద అధిక వడ్డీలకు నగదు అప్పుగా తీసుకున్నారు. కొంతకాలం వ్యాపారం సజావుగా సాగినా అనంతరం నష్టాల్లోకి వెళ్లింది. అప్పు ఇచ్చినవారి నుంచి ఒత్తిడి అధికం కావడంతో అప్పు, వడ్డీ కలిపి తీర్చే పరిస్థితి లేదని ఐపీ దాఖలు చేసుకుంటున్నట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. 18 మంది నుంచి నగదు అప్పుగా తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ముక్కంటి మహత్యం.. విదేశీ భక్తుల తదాత్మ్యం



వీధుల్లో అమ్ముతున్న మొక్కజొన్న కంకులు విదేశీ భక్తులను నోరూరించింది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చిన రష్యా, జర్మనీ భక్తులు గురువారం సన్నిధివీధిలో వీధి బండిపై పెట్టుకుని అమ్ముతున్న మొక్కజొన్న కంకికి కారం పూసి తీసుకున్నారు. వీటిని పోటీ పడి తీసుకోవడం విశిష్టతను సంతరించుకుంది. రాహు, కేతు సర్ప దోష నివారణ క్షేత్రంగా అంతర్జాతీయ ఖ్యాతి పొందిన శ్రీకాళహస్తికి విదేశీయుల తాకిడి పెరుగుతోంది. రష్యా, జర్మనీ దేశాలకు చెందిన 54 మంది భక్తులతో కూడిన బృందం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చింది. క్షేత్ర ప్రాభవాన్ని వారి వెంట వచ్చిన గైడ్లను అడిగి తెలుసుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అపురూపమైన శిల్పాలు, ఆలయ నిర్మాణ తీరుతెన్నులను చూసి సంభ్రమాశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

చేనేత వస్త్ర వ్యాపారులకు టోకరా

మంత్రి ఆనం వద్ద బాధితుల మొర

సంగం, న్యూస్‌టుడే: ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని చేనేత వస్త్ర వ్యాపారులను తిరుపతికి చెందిన దంపతులు రూ.రెండు కోట్ల మేర మోసం చేసిన ఘటన తాజాగా వెలుగుచూసింది. బాధితులు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆశ్రయించడంతో ఆయన ఆత్మకూరు డీఎస్పీని ఈ విషయమై విచారించాలని ఆదేశించారు. వివరాల మేరకు నియోజకవర్గానికి చెందిన చేనేత వస్త్ర వ్యాపారులు పెద్ద మొత్తంలో ఇతర ప్రాంతాలకు పట్టుచీరలను విక్రయిస్తుంటారు. వీరి వద్దకు మూడు నెలల క్రితం తిరుపతికి చెందిన దంపతులు వచ్చారు. మొదటగా చేజర్ల మండలం చిత్తలూరులో ఓ వ్యాపారితో పట్టుచీరల వర్తక లావాదేవీలు సక్రమంగా నిర్వహించి నమ్మకం పెంచుకున్నారు. ఆపై ఆయన పరిచయాన్ని అడ్డుగా పెట్టుకుని చీరలకు అధిక ధరలు చెల్లిస్తామంటూ సంగం, చేజర్ల, ఏఎస్‌పేట మండలాల్లోని చేనేత వ్యాపారులను మభ్యపెట్టారు. కొంతమేర నగదు చెల్లించడంతో వ్యాపారులు రూ.లక్షల విలువ చేసే పట్టుచీరలను గంపగుత్తగా ఇచ్చారు. మిగిలిన వాటికి ఈ నెల అయిదో తేదీన చెల్లుబాటు అయ్యేలా బ్యాంకు చెక్కులిచ్చారు.

చెక్కులు చెల్లుబాటు కాకపోవడంతో..

వారిచ్చిన బ్యాంకు చెక్కులు చెల్లుబాటు కాకపోవడంతో తాము మోసపోయినట్లు వ్యాపారులు గ్రహించారు. ఈ వ్యవహారం తేల్చుకోవాలని ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తాము రూ.రెండు కోట్ల వరకు మోసపోయామని, న్యాయం చేయాలని అందులో పేర్కొన్నారు. మంత్రి ఆనం స్పందిస్తూ.. పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ కె.వేణుగోపాల్‌ను ఆదేశించారు. డీఎస్పీని వివరణ కోరగా ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	244
లేయర్ మాంసం	195

ఎల్ఎల్‌బీ పరీక్ష ఫలితాల విడుదల

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో ఇటీవల నిర్వహించిన బీఏ ఎల్ఎల్‌బీ పరీక్ష ఫలితాలు గురువారం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ పదో సెమిస్టర్ ఫలితాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌పై విచారణాధికారి మార్పు

తడ, న్యూస్‌టుడే: తడ భీములవారిపాళెం చెక్‌పోస్టులో గనుల శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన మురహరిపై అవినీతి ఆరోపణ కేసు విచారణాధికారిని ప్రభుత్వం మార్చింది. ఇప్పటికే సదరు ఉద్యోగిపై ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం అభియోగాలు నమోదు చేసింది. గతంలో విచారణాధికారిగా ఉన్న గుంటూరు డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు స్థానంలో శ్రీనివాసకుమార్‌ను విచారణ అధికారిగా ప్రభుత్వం మార్చింది. ఈ మేరకు విచారణ కొనసాగనుంది.

తిరుమలలో పోలీసుల సూచనలు పాటించాలి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో ప్రైవేటు ట్యాక్సీ డ్రైవర్లు పోలీసు సూచనలు పాటించాలని తిరుమల డీఎస్పీ విజయ్‌శేఖర్, తితిదే వీజీవో సురేంద్ర తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక ఆస్థాన మండపంలో తిరుమల ట్రాఫిక్ డీఎస్పీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ట్యాక్సీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు నుంచి ప్రైవేటు వాహనాలను పీఏసీ3 వరకు మాత్రమే తీసుకురావాలని, అనంతరం జీఎన్‌సీ నుంచి తిరుపతికి వెళ్లాలని సూచించారు. గరుడసేవ ముందు అక్టోబర్ 7 సాయంత్రం నుంచి ఎటువంటి ట్యాక్సీలను అనుమతించమని అక్టోబర్ 9 నుంచి యథావిధిగా వాహనాలను అనుమతిస్తామని తెలిపారు. ఏవీఎస్‌వోలు గిరిధర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాలుర జట్టు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: అండర్- 19 వాలీబాల్ బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు 130 మంది హాజరయ్యారని, ప్రతిభకనబరిచిన 15 మంది బాలుర, 15 మంది బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైనవారు కృష్ణా జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

మట్టి తవ్వకాలు అడ్డుకున్న రైతులు

కోట, న్యూస్‌టుడే: ఉత్తమ నెల్లూరు చెరువులో యంత్రాలతో మట్టి తవ్వకాలకు గురువారం కొందరు యత్నించగా గ్రామస్థులు, ఆయకట్టు రైతులు అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో యంత్రాల డ్రైవర్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. పోలీసులు వచ్చి యంత్రాలను పంపేశారు. మట్టి తవ్వకాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.



యంత్రాలను అడ్డుకున్న గ్రామస్థులు

మొగిలి ఘాట్‌లో ప్రమాదం- ఇద్దరి దుర్మరణం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలోని మొగిలి ఘాట్ వద్ద బుధవారం అర్ధరాత్రి ఆగిఉన్న లారీని.. వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న దుర్ఘటనలో లారీ డ్రైవర్, క్లీనర్ దుర్మరణం పాలయ్యారు. చిత్తూరు జిల్లా వి.కోట నుంచి తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి తైలం దుంగలు తలిస్తున్న లారీ మొగిలి ఘాట్ రోడ్డులో మరమ్మతులకు ఆగి ఉండగా, కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ నుంచి మొగిలి వద్ద ఉన్న పొట్రాన్ పరిశ్రమకు చక్కెర తరలిస్తున్న లారీ అదుపుతప్పి ముందు నిలిచిన లారీని ఢీకొనడంతో డీజిల్ ట్యాంకు పగిలి నిప్పంటుకుని లారీ రహదారి పక్క పది అడుగుల లోయలో బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ నుజ్జునుజ్జయి తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేటకు చెందిన లారీ క్లీనరు యాదగిరి(48) లారీ క్యాబిన్‌లో ఇరుక్కుని మృతి చెందగా డ్రైవరు సాయిక్రిష్ణకు గాయాలు తగిలాయి. తూర్పుగోదావరికి చెందిన కొయ్యల లారీ డ్రైవరు రామరాజు(48) మంటల్లో చిక్కుకుని కాలి బూడిదయ్యాడు. క్లీనరు నాగయ్యకు తీవ్రగాయాలవడంతో చిత్తూరు ఆస్పత్రికి తరలించారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను బంగారుపాళ్యం ఆస్పత్రికి చేర్చారు. సీఐ కత్తి శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాద నేపథ్యంలో వాహనాలు దారిమళ్లించిన సమయంలో మరో రెండు ప్రమాదాలు చోటుచేసుకోవడం గమనార్హం.



మంటల్లో కాలుతున్న లారీ

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి



ఊకా విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

ఊకా విజయ్‌కుమార్‌కు సన్మానం

జీవకోన(తిరుపతి), న్యూస్‌టుడే: ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తెదేపా నేత ఊకా విజయ్‌కుమార్‌ను గురువారం రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు సన్మానించారు. గండంభాను, మల్లెలనాగరాజు, రాజయ్య, శంకర్, దేవానంద్, గండం వెంకటమణి పాల్గొన్నారు.

నేడు స్వామీజీల సమావేశం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి తిరుమల పర్యటనను వ్యతిరేకిస్తూ తిరుపతిలో నిరసన కార్యక్రమాలు ఊపందుకున్నాయి. హిందూ సంఘాలు, స్వామీజీలు, సాధువులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. శుక్రవారం తిరుపతిలోని ప్రైవేటు హోటల్లో పలువురు సాధువులు, హిందూ సంఘాల నేతలు సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో జగన్ పర్యటనను అడ్డుకునే నిమిత్తం ఓ ప్రణాళికను రూపొందించుకోనున్నట్లు తెలిసింది.

విద్యార్థినుల శ్రమదానం

మహిళా వర్సిటీ (తిరుపతి), న్యూస్‌టుడే: శ్రీపద్మావతి మహిళా వర్సిటీకి చెందిన ఆంగ్ల విభాగం, తెలుగు, వ్యాయామ, జర్నలిజం విభాగాలకు చెందిన విద్యార్థినులు, పరిశోధకులు గురువారం శ్రమదానం నిర్వహించారు. ఇన్‌ఛార్జి వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, డీన్ వాణి పర్యవేక్షించారు.

రోజంతా స్వచ్ఛతా హీ సేవా



3కె రన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలతో తిరుపతి నగరం గురువారం కళకళలాడింది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం వివేకానంద కూడలి నుంచి టౌన్‌క్లబ్ బాలాజీ కాలనీ మీదుగా ఎస్వీయూ వరకు నిర్వహించిన 3కె రన్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య ప్రారంభించారు. హేమంత్‌కుమార్, శ్యాంసన్, సాయి కృష్ణ; మహిళ విభాగంలో గౌతమి, చౌడేశ్వరి, బబిత; పిల్లల విభాగంలో దానిష్, ప్రదీప్ నగదు బహుమతులు అందుకున్నారు. ఇందిరామైదానంలోని ఇండోర్‌స్టేడియంలో కార్మికులకు నగరపాలిక అధికారుల ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. కచ్చపి ఆడిటోరియం వేదికగా నిర్వహించిన వేస్ట్ టు ఆర్ట్, వేస్ట్ టు వండర్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ఉత్పత్తులకు బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డీఎంహెచ్‌వో శ్రీహరి, అదనపు కమిషనర్ చరణ్‌తేజరెడ్డి, డీసీ అమరయ్య, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈ విజయ్‌కుమార్‌రెడ్డి, మహేష్,రాజు, సంజయ్‌కుమార్, వైద్యాధికారి అన్వేష్‌రెడ్డి, ఎస్ఎస్ చెంచయ్య, సుమతి, మస్తాన్ పాల్గొన్నారు.

దేవుడి భూములిచ్చి దేహీ అనేలా..!

☛ జగనన్న కాలనీకి సేకరణ

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: పేదల ఇళ్ల స్థలాల కోసమని గత ప్రభుత్వం భూములు తీసుకుంది. అందులో రామాలయ ట్రస్టు భూమి ఉంది. 52 మందికి నష్టపరిహారం చెల్లించిన ప్రభుత్వం అదే దేవుడి భూమికి మాత్రం పరిహారం ఇవ్వకుండా తాత్సారం చేసింది.

తిరుపతి గ్రామీణ మండలం దుర్గసముద్రం గ్రామానికి చెందిన సుబ్బయ్యకు రెండెకరాల భూమిని ప్రభుత్వం ఐదు దశాబ్దాల కిందట పంపిణీ చేసింది. అతను అవివాహితుడు కావడంతో రామాలయానికి రాసిచ్చారు. సదరు భూమిలోని మామిడి చెట్ల కాపును విక్రయించగా ఏటా రూ.20 వేల ఆదాయం వచ్చేది. గ్రామస్థులు ఆలయ నిర్వహణకు రామమందిర భజన ట్రస్టును ఏర్పాటు చేసుకున్నారు. ఏటా శ్రీరామ నవమిని పురస్కరించుకుని 11 రోజులు ఉభయాలు నిర్వహించేవారు. ప్రతి శనివారం అభిషేకం నిర్వహిస్తున్నారు. ఆలయ ఆదాయంలోనే నెలనెలా అర్చకుడి వేతనాలు చెల్లిస్తున్నారు.

మూడేళ్లుగా పరిహారం లేక..

వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి 2020లో చర్యలు చేపట్టింది. రామాపురం వద్ద 80 ఎకరాలు డీకేటీ భూములు తీసుకుంది. ఎకరాకు ఎ-కేటగిరీ కింద రూ.49,01,000, బి-కేటగిరీకి చెందిన భూములకు రూ.25 లక్షలుగా పరిహారం ఇచ్చారు. ఓ-కేటగిరి కింద పరిహారం ఇప్పించాలని గ్రామస్థులు అధికారులను కోరినా బి-కేటగిరీ కింద చేర్చి కలెక్టర్‌కు దస్త్రం పంపించారు.



జగనన్న కాలనీకి ఇచ్చిన రామాలయ భజన మందిరం ట్రస్టు భూమి ఇదే

తర్వాత భూమికి సంబంధించి పరిహారం ఊసేలేకుండాపోయింది. పలు దఫాలుగా స్థానికులు కలెక్టరేట్‌లో సంప్రదించినా దేవుడి ట్రస్టు పేరుతో భూమి ఉండటంతో దస్త్రాన్ని పట్టించుకోలేదు. అప్పటి ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడంతో ఎమ్మెల్యే పులివర్తి నానిని ఇటీవల సంప్రదించారు. కూటమి ప్రభుత్వం స్పందించి దేవుడి ట్రస్టు పేరుతో ఉన్న భూమికి పరిహారం ఇప్పిస్తే ధూపదీప నైవేద్యాలకు వీలుంటుందని గ్రామస్థులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే:

సమస్య: పోస్టల్ కాలనీ నాలుగో క్రాస్‌లో ఎడమ వైపు యూడీఎస్ మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగుతోంది. **- రాధాకృష్ణ, పోస్టల్‌కాలనీ**

సమాధానం: సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడుతాం. **- అన్వేష్‌రెడ్డి, నగరపాలిక వైద్యాధికారి**

చంద్రగిరి, న్యూస్‌టుడే:

సమస్య: రాయలవారికోటకు రక్షణగా అగర్తకాల్వ గట్టుపై బండరాళ్లతో నిర్మించిన ప్రహరీ ముళ్లచెట్లు పెరిగి బీటలు వారింది. శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం పక్కన తీగలు పెరిగాయి. **- కుంచా మునిచంద్రరాయల్ చంద్రగిరి**

సమాధానం: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. **- ప్రవీణ్‌కుమార్, కన్సర్వేషన్ అసిస్టెంట్, పురావస్తు శాఖ**

పాకాల, న్యూస్‌టుడే

సమస్య: దామలచెరువు పంచాయతీ కేశవనగర్ కట్టుకాలువ గట్టున ఇళ్లు ఆనుకుని నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. కంచె ఏర్పాటు చేయాలి. **- రమేష్, ప్రయాణికుడు**

సమాధానం: కంచె ఏర్పాటు చేయిస్తాం. **- జనార్దనరావు, ఏఈ**

❖ అక్కారంపల్లె పెద్ద చెరువు సుమారు 32.20 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో ఏకంగా ఐదెకరాల వరకు ఆక్రమణలు జరిగినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఇక్కడే పూలవానిగుంట చెరువు సుమారు 23.82 ఎకరాల్లో ఉండగా రెండెకరాలు ఆక్రమణకు గురైంది.

❖ ఉప్పరపాలెం చెరువు 21.22 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉండగా ఏకంగా 19.72 ఎకరాలు అక్రమార్కుల పాలైంది.

కాలువలు కనుమరుగు..
చినుకుపడితే కన్నీరు

❖ చెరువులకు నీరు వెళ్లే దారుల ఆక్రమణ
❖ వర్షం పడితే జలమయం

ఈనాడు-తిరుపతి: భారీ వర్షాలకు నగరాలు నీట మునిగాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రధాన నగరాలు, పట్టాలు అన్నీ జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇందుకు కాలువలు, చెరువుల ఆక్రమణే ప్రధాన కారణంగా నిగ్గు తేల్చారు. మూడేళ్ల కిందట తిరుపతి నగరంలో కురిసిన భారీ వర్షానికి నగరం జలమయమైంది. రాయలకాలంలో నిర్మించిన చెరువులు ఆక్రమణకు గురికావడంతోపాటు కాలువలూ ఆక్రమణకు గురయ్యాయి. గొలుసుకట్టు చెరువులకు నీరు వెళ్లే దారిలేక చిన్న వర్షానికే రహదారులు చెరువులను తలపించే దుస్థితి నెలకొంది.

లెక్కల్లో ఉంది అంతే..

తిరుపతి అంటేనే చెరువుల నగరం (సిటీ ఆఫ్ లేక్స్). ఎక్కడ చూసినా చెరువులు కళకళలాడుతుండేది. ఇప్పుడు అవన్నీ కనుమరుగయ్యాయి. తిరుపతి, తిరుపతి గ్రామీణ, రేణిగుంట, చంద్రగిరితోపాటు అటు శ్రీకాళహస్తి ప్రాంతాల్లోని చెరువులు, కాలువలు, కుంటలు మాయమయ్యాయి. నగరం విస్తరిస్తున్న కొద్దీ ఆక్రమణలు పెరుగుతున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం నగర పరిధిలో 269.74 ఎకరాల్లో చెరువులు, కుంటలు ఉండగా.. ఇప్పుడు వాటిలో సగం కూడా లేవు.

ఎక్కడ చూసినా ఆక్రమణలే..

వైకాపా హయాంలో ఏకంగా వెంకటాపురం చెరువులోని సుమారు ఆరెకరాలు రిజిస్ట్రేషన్ చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థమవుతోంది. ఆక్రమణను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు సైతం కబ్జాదారులకు వెన్నుదన్నుగా నిలిచారు. తిరుపతి గ్రామీణ మండల పరిధిలో 1577.86 ఎకరాల విస్తీర్ణంలో చెరువులు, కాలువలు ఉన్నాయి. ఒక సర్వే నంబరు పరిధిలోని చెరువుకు సంబంధించి ఏకంగా దస్త్రాలనే మార్చేశారు. తిరుచానూరు పరిధిలో వసుంధరనగర్‌లోని 442 సర్వే నంబరులో 3.46 ఎకరాల కాలువ పోరంబోకు స్థలం ఉన్నట్లుగా రెవెన్యూ దస్త్రాల్లో ఉండగా అది ఆక్రమణకు గురైంది.

గొలుసుకట్టు తీసికట్టు

రాయలకాలంలో నీటి ప్రాధాన్యతను గుర్తించి గొలుసుకట్టు చెరువులు నిర్మించారు. తిరుపతిని ఆనుకుని పరిశీలిస్తే వినాయకసాగర్ (లింగాలమ్మ చెరువు), పాన చెరువు, తిమ్మినాయుడుపాలెం (మంగళం చెరువు), చెన్నాయగుంట, వెంకటాపురం, కరకంబాడి చెరువులు అన్నీ ఒకదానికొకటి అనుసంధానంగా నిర్మించారు. వీటికి నీరు చేరే కాలువలన్నీ ఆక్రమణల పాలయ్యాయి. శేషాచల అటవీ ప్రాంతంలో వర్షాలు కురిసిన ప్రతిసారీ నీరు మొత్తం మంగళం రోడ్డుపైనే నిలుస్తోంది. ఇప్పటికైనా పాలకులు ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి కాలువను పునరుద్ధరిస్తే ముంపును తప్పించేందుకు ఆస్కారం ఉంటుంది.



వేమూరులోని క్షేత్రంలో మాలి దేశ ప్రతినిధులు

ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో నిరంతరం ఆదాయం లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖం అన్నారు. గురువారం తిరుపతి గ్రామీణ మండలం వేమూరులోని దామా అప్పయ్యనాయుడుకు చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని మాలి దేశానికి చెందిన బృందం సందర్శించింది. మాలి దేశానికి చెందిన ప్రతినిధి రమదాన్ సిల్లా, సురేంద్ర, రవిచంద్రప్రసాద్, పట్టాభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2న కపిలతీర్థంలో ఉచిత పిండ ప్రదానాలు

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: కపిలతీర్థంలో అక్టోబర్ 2న మహాలయ అమావాస్య సందర్భంగా ఉచితంగా పిండ ప్రదాన కార్యక్రమం చేపడుతున్నట్లు శ్రీకపిలేశ్వర బ్రాహ్మణ పురోహిత సేవా సంఘం సభ్యులు తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడారు. అనిల్ కుమార్, విజయ భాస్కర్, శివానంద శాస్త్రి, రాజేష్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

బంగారు తిరుచ్చిపై విహారం

చంద్రగిరి: వారోత్సవాల్లో భాగంగా శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామికి శ్రీదేవి భూదేవిలతో ఆర్జిత కల్యాణ మహోత్సవం నిర్వహించారు. శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణ, శ్రీఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు.

నేడు ఎస్వీయూలో ఉద్యోగ మేళా

తిరుపతి (బైరాగిపట్టెడ): ఎస్వీయూలోని ఎంసీఏ భవనంలోని 215వ గదిలో శుక్రవారం ఉదయం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్ నరసయ్య తెలిపారు. ప్రముఖ ఐటీ కంపెనీ అభయ్‌రామ్ ఆధ్వర్యంలో 2021 పూర్వం ఎమ్మెస్సీ, ఎంసీఏ పూర్తిచేసిన విద్యార్థులు ఈ ఎంపికకు అర్హులని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనులకు వంద మంది నియామకం?

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిమిత్తం పొరుగుసేవల విధానంలో వంద మందిని తీసుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్



నాగరాజు నాయక్

తిరుపతి (బైరాగిపట్టెడ): ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగ పరిశోధక విద్యార్థి నాగరాజు నాయక్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ తెలిపారు. ఆచార్య ఎం.పద్మావతి మార్గదర్శకత్వంలో 'ప్రైవసీ ప్రివెన్షన్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ ఇన్ క్లౌడ్ విత్ సీఎన్ఎన్ అండ్ హైబ్రిడ్ క్రిప్టో గ్రాఫిక్ స్కీం' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినట్లు వెల్లడించారు.

తిరుమల టూటౌన్ సీఐగా శ్రీరాముడు



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల టూటౌన్ సీఐగా శ్రీరాముడు నియమితులయ్యారు. గతంలో నియమితులైన సీఐ వారంలోపే బదిలీపై వెళ్లడంతో తిరుమల క్రైమ్ సీఐ శేషగిరిరావు ఇన్‌ఛార్జి వ్యహరిస్తున్నారు. భక్తుల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని శ్రీరాముడు తెలిపారు.

తూర్పు సీఐ బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసులు

తిరుపతి(నేరవిభాగం): తూర్పు పోలీస్ స్టేషన్ సీఐగా కచ్చల శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేశారు. 2007 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసులు కర్నూలు, అనంతపురం జిల్లాలో విధులు నిర్వహించారు. సీఐగా అనంతపురం, కర్నూలు జిల్లాలో పనిచేశారు.

రామచంద్రాపురంలో ఉప తహసీల్దార్..

రామచంద్రాపురం: ఉప తహసీల్దార్ అన్వర్ బాషా గురువారం బాధ్యతలు తీసుకున్నారు. చిన్నగొట్టిగట్టు మండలంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న పుణితరాణి శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. తిరుపతి అర్బన్ కార్యాలయంలో మండల సర్వేయర్‌గా పని చేస్తున్న రమేష్‌బాబు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న హేమకుమార్ తిరుపతి గ్రామీణ కార్యాలయానికి వెళ్లారు.

తితిదే ఈవోను కలిసిన కేఎంఎఫ్ ప్రతినిధులు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (నందిని డెయిరీ) ప్రతినిధులు గురువారం తితిదే ఈవో జె.శ్యామలరావును కలిశారు. డెయిరీ ఉత్పత్తులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు.

అంకితభావంతో పని చేయండి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో పారిశుద్ధ్య కార్మికులు అంకితభావంతో పనిచేయాలని తిరుమల ఆరోగ్యాధికారి డా.మధుసూదన్‌రావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆస్థాన మండపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన పారిశుద్ధ్యసేవలను అందించాలన్నారు. అనంతరం తితిదే ఏవీఎస్‌వో గిరిధర్ మాట్లాడుతూ.. భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

చంద్రగిరి: మండలంలోని రైతులు, పాడిరైతులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గురువారం బ్రాంచి మేనేజరు దామోదరం అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారి డా.వంశీ, తిరుపతి ఎస్బీఐ ఏవో ఇందిరా ప్రియదర్శిని, అధికారులు రాజేశ్వరి, వినయ్, రైతులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖలో ఈఈల బదిలీ

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: జలవనరుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీలు చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడపలో పనిచేస్తున్న సునీల్ నాయక్‌ను తెలుగుగంగ ప్రాజెక్టు తిరుపతి డీసీఈగాను, నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న వెంకటరాజును రేణిగుంట సర్కిల్ పరిధిలో తెలుగు గంగ ప్రాజెక్టుకు డీసీఈగా బదిలీ చేశారు.

విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రులదే కీలకపాత్ర

పాకాల, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత చదువులు సాధించడంతోపాటు సమాజంలో మంచి పౌరులుగా ఎదగడంలో తల్లిదండ్రులది కీలకపాత్రని స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి అన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో విద్యార్థుల పురోగతిపై తల్లిదండ్రులతో చర్చించారు. అధ్యాపకులు జయచంద్ర, యర్రయ్య, హరినాథాచారి, నాగరాజనాయుడు, మునిరాజు పాల్గొన్నారు.

నడకదారిలో వ్యాపారుల వాగ్వాదం

తిరుమల, న్యూస్‌టుడే: అలిపిరి-తిరుమల నడక మార్గంలోని ఏడోమైలు వద్ద అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు కొందరు యత్నించారు. అటవీప్రాంతంలో దుకాణాలు ఏర్పాటుచేసేందుకు యత్నిస్తుండగా స్థానిక వ్యాపారులు వారిని అడ్డుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే మనుషులమంటూ చెప్పడంతో వాగ్వాదానికి దిగారు. తితిదే డీఎఫ్‌వో శ్రీనివాసులు స్పందిస్తూ నడకదారిలో తాము ఎవరికీ అనుమతి ఇవ్వలేదని, విషయాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురికి జైలు

తిరుపతి(లీగల్): తూర్పు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ముగ్గురు నిందితులు ఒక్కొక్కరికి ఆరునెలల జైలుశిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం తీర్పు వెలువరించారు. కలిశెట్టి సుబ్రహ్మణ్యం అలియాస్ మణి, గిద్దలూరు సుబ్రహ్మణ్యం, సయ్యద్ అబ్దుల్ కరీం అలియాస్ బ్రోపై కేసు నిరూపణ కావటంతో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

వదినపై వేధింపుల కేసులో జైలు

తిరుపతి(లీగల్): తిరుమల రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన లైంగిక వేధింపుల కేసులో నిందితునికి ఆరునెలల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం తీర్పు వెలువరించారు. తిరుమల న్యూ సి-టైపు క్వార్టర్సులో కాపురం ఉండే దంపతులకు ఇద్దరు కుమారులు. నిందితుడు బి.సునీల్‌కుమార్ వదినపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. తనవద్ద నగ్న చిత్రాలు ఉన్నాయంటూ బెదిరించి రూ.20లక్షలు డిమాండ్ చేశారు. బాధితురాలు 2018లో రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనితోపాటు అతనికి సహకరించిన తల్లిదండ్రులను అరెస్టు చేసి కోర్టుకు అప్పగించారు. విచారణ సమయంలో తండ్రి మృతిచెందగా తల్లిపై కేసు కొట్టివేశారు. నిందితునికి పైన పేర్కొన్న జైలు శిక్ష, జరిమానా విధించారు.



దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన శ్రీమేధా దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం స్వామి వారి సన్నిధి వద్ద సంకల్ప పూజలు నిర్వహించి ధృవమూర్తికి గోక్షీరంతో పాటు విశేష పూజా ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ధూప, దీప, నివేదనలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విశేషాభిషేకాల్లో పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

• శ్రీకాళహస్తి • సత్యవేడు

రేపు ఉచిత వైద్య శిబిరం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: మండలంలోని తంగేళ్లపాళెంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తి పట్టణంలోని భరత్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీపీ, చక్కెర, గుండె సంబంధిత పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు వివరించారు.

విద్యార్థుల శ్రమదానం

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం, పిచ్చాటూరుల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు గురువారం శ్రమదానం చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కళాశాలల ఆవరణలోని పిచ్చి మొక్కలు, ముళ్లచెట్లను తొలగించారు. చెత్తాచెదారాలను తొలగించి పారిశుద్ధ్య పునరుద్ధరణ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ శ్రీలత, ఢిల్లీబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి వినుత, కార్యకర్తలు

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఏర్పేడు, న్యూస్‌టుడే: కల్తీ నెయ్యితో దేవాలయాలను అపవిత్రంగా మార్చిన వైకాపా నేతలను కఠినంగా శిక్షించాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి వినుత తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మూడోరోజు గురువారం వికృతమాలలోని శ్రీ సంతాన సంపద వేంకటేశ్వరస్వామి ఆలయంలో భర్త చంద్రబాబు, కార్యకర్తలతో కలిసి దీక్ష నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గోవింద నామస్మరణతో పూజలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించిన వైకాపా నేతలపై చర్యలు తీసుకోవాలని కోరారు.



కళత్తూరులో సాగుకోసం దుక్కి దున్ని సిద్ధంగా ఉంచిన భూమి



అరకొర నీటితో అంబూరు చెరువు



సీఎల్‌ఎన్‌పల్లిలో తాజాగా వేసిన వరినార్లు

ముఖం చాటేసిన వరుణుడు

- నీరుచేరని చెరువులు
- ప్రశ్నార్థకంగా వరి సాగు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ఇటీవల విజయవాడ, గుంటూరు ప్రాంతాలు భారీ వరదలకు అతలాకుతలం కాగా ఇక్కడ అరకొర వర్షాలతో చెరువులు నిండక రైతులు కరువు కోసం ఎదురుచూస్తున్నారు. అడపాదడపా వర్షాలు కురిస్తున్నా ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా తెలుగుగంగపై ఆశలు పెంచుకుంటున్నారు. నియోజకవర్గంలో సాగు కోసం రైతులు భూములను దుక్కిదున్ని సిద్ధం చేసుకోగా, చెరువుల్లో తగిన స్థాయిలో నీరు లేక పోవడం ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో 'గంగ' ద్వారా సాగునీరు అందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

అదను దాటినా.. జాడ లేని వరుణుడు

సాధారణంగా నియోజకవర్గంలో అత్యధిక శాతం రైతాంగం సెప్టెంబరు, అక్టోబరులలో వరి పంట సాగు చేస్తుంటారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో దాదాపు 32 వేల హెక్టార్లలో వరి సాగవుతుంది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు ఒక మోస్తరుగా కురుస్తాయి. దీంతో కొన్ని మాగాణి భూములు గల ప్రాంతాల్లో ఇప్పటికే వరి నార్లు నాటే ప్రక్రియ పూర్తిగా, మరికొన్ని ప్రాంతాల్లో భూమిని దుక్కి దున్ని సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే రెండు నెలలుగా వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడం, అప్పుడప్పుడు ఒక మోస్తరు వర్షాలు కురిసి ఊరిస్తున్నాయి. సాధారణ పరిస్థితుల్లో ఈ పాటికే చెరువులు జలకళను సంతరించుకుంటాయి. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో ప్రస్తుతం చెరువుల్లో అరకొరగా నీరు చేరాయి.

గంగ పైనే ఆశలు

నియోజకవర్గంలో బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు ప్రాంతాలకు తెలుగుగంగ కాలువ సాగు నీటి వరప్రదాయినిగా రైతాంగాన్ని ఆదుకుంటోంది. వర్షాభావ పరిస్థితుల్లో సైతం ఈ ప్రాంతాల్లో పంటలు సస్యశ్యామలం కావడానికి తెలుగుగంగ ప్రధాన సాగునీటి వనరుగా ఉంది. ప్రస్తుతం చెరువుల్లో తగిన నీరు లేని నేపథ్యంలో తెలుగుగంగపైనే రైతులు ఆధారపడుతున్నారు. ప్రస్తుతం తెలుగు గంగ ద్వారా తమిళనాడుకు నీటిని విడుదల చేయడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. చెరువులకు సైతం 'గంగ' నీరు అందిస్తారని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఈ విషయమై తెలుగుగంగ ఏఈ పెంచలయ్య మాట్లాడుతూ ప్రస్తుతానికి తమిళనాడుకు మాత్రమే సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే చెరువులకు సైతం నీటిని సరఫరా చేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

సత్యవేడు, న్యూస్‌టుడే

సమస్య: మండల కేంద్రం నుంచి తమిళనాడుకు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. చిన్నపాటి వర్షానికే గుంతలు జలమయం కావడంతో ద్విచక్ర వాహదారులు, స్థానికులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు.

- పాంమాంజి రవీంద్ర, స్థానికుడు

సమాధానం: ఆరు నెలలకు ముందు రోడ్డు విస్తరణకు, రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రస్తుత ప్రభుత్వం నిధులు కేటాయిస్తే పనులు చేపట్టి అసౌకర్యాన్ని తొలగిస్తాం. **- ఇజ్రాయిల్, ర.భ. శాఖ జేఈ సత్యవేడు**

కుళాయి మరమ్మతు

వరదయ్యపాళెం : స్థానిక ఎస్సీకాలనీ తాగునీటి కుళాయిల నుంచి నీరు లీకవుతుండటంతో కుళాయిల చుట్టూ నీరు చేరి మురికి కూపంగా మారి తాగునీరు కలుషితం అవుతోంది. దీనిపై ఈ నెల 22వ తేదీన ఆదివారం 'ఈనాడు'లో 'మేమున్నాం..మీకు తోడుగా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి తాగునీటి కుళాయిని మరమ్మతు చేసి నీటి లీకేజీని అరి కట్టారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

నాగలాపురం, న్యూస్‌టుడే: స్థానిక దక్షిణపు కోటవీధిలో తాగునీటి సరఫరాను గురువారం పునరుద్ధరించారు. ఇక్కడ తాగునీటి బోరు నుంచి వేసిన పైపులైన్ దెబ్బతిని నీటి ఎద్దడి తలెత్తడంపై 'మేమున్నాం.. మీకు తోడుగా..' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 20వ తేదీన ప్రచురితమైన కథనంపై సర్పంచి చిన్నదురైసుధ స్పందించారు. సిబ్బందితో దెబ్బతిన్న పైపులను మార్పు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు.

స్పందనకు వందనం

- **వీధి దీపాలు ఏర్పాటు.. శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** పట్టణంలోని మిట్టకండ్రిగ, శ్రీరాంనగర్ కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదంటూ అక్కడి నివాస గృహస్థుల ఫిర్యాదు మేరకు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై స్పందించిన అధికారులు గురువారం ఈ రెండు ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.
- **స్నానఘట్టాల వద్ద శుభ్రం..** సువర్ణముఖి నదిని ఆనుకుని సన్నిధివీధిలో స్నానఘట్టాల వద్ద పాచి పట్టి భక్తులు స్నానాలు చేసేందుకు ఇబ్బందికరంగా ఉండటంపై 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షిక ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అక్కడి పాచిపట్టిన మెట్లను పారిశుద్ధ్య విభాగం అధికారి వెంకటస్వామి ఆదేశాలతో సహాయ ఉద్యోగి కుమార్ పాచిని తొలగించి భక్తులకు ఇబ్బందులు తప్పించారు.



ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసనాయక్

చట్టాలపై అవగాహన అవసరం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సబ్‌జైలులో శిక్ష అనుభవిస్తున్న నిందితులకు చట్టాలపై అవగాహన ఎంతో అవసరమని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసనాయక్ అన్నారు. శ్రీకాళహస్తి సబ్ జైలును గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ నిందితులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బెయిల్ పొందడం, ఉచిత న్యాయ సాయం తదితర అంశాల గురించి వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సమస్యలేమైనా ఉంటే అర్జీ రూపంలో ఇస్తే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానాల్లో ఇసుక తవ్వకాలా..?

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్మశానాలను వదలకుండా ఇసుక తవ్వకాలు చేపట్టడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగ సమీపంలోని స్వర్ణముఖినదిలో ఇసుక తవ్వకాలను గురువారం సీపీఐ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానం కోసం కేటాయించిన స్థలాన్ని కూడా వదలకుండా ఇసుకాసురులు యంత్రాలతో తవ్వకాలు జరుపుతూ ట్రాక్టర్లతో బయట ప్రాంతాలకు తరలిస్తుండడం దారుణమని అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గురవయ్య, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణముఖినదిని పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

భగవద్గీత పుస్తకాల వితరణ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీప్రసన్న వరదరాజస్వామి సత్సంగ సభ్యులకు ఆలయ మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు భగవద్గీత పుస్తకాలను వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా సత్సంగ సభ్యులతో ఆయన గురువారం స్వగృహంలో సమావేశం అయ్యారు. రోజువారీ భగవద్గీత సత్సంగానికి హాజరయ్యే సభ్యులకు 18 అధ్యాయాలకు సంబంధించిన పుస్తకాలను వితరణగా అందజేశారు.



ఉపాధ్యాయురాలు మమతకు సన్మానం

అవార్డు గ్రహీతకు సత్కారం

నారాయణవనం : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డును అందుకున్న మండలంలోని సముదాయం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు మమతను ఘనంగా సత్కరించారు. ఈనెల 22న తిరుపతిలో ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలో బెస్ట్ పర్‌ఫార్మర్ విభాగంలో డీఈఓ శేఖర్ చేతుల మీదుగా ఆమె ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. సర్పంచి సుబ్రహ్మణ్యం రెడ్డి, పాఠశాల కమిటీ అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది హేమలత, రేణుక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని సన్మానించి అభినందించారు.



దర్గా పీఠాధిపతుల ఆశీర్వాదాన్ని అందుకుంటున్న రిషితారెడ్డి

ఉరుసు ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలోని బి.పి.అగ్రహారం హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా జుంలేషా పీర్ చిష్టియుల్ ఖాదర్‌వలీ అల్లా వారి ఉరుసు వార్షిక గంధోత్సవాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్గా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చారు. గంధోత్సవ నిర్వహణకు అవసరమైన వస్తువులను శిరస్సుపై ఉంచుకుని అక్కడి మఠాధిపతులకు అందజేశారు. భక్తుల సమక్షంలో ఉరుసు వార్షిక గంధోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు.



ప్రమాదకరంగా మారిన ఫ్యూజ్‌కారియర్

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట పంచాయతీలోని పోస్టాఫీసువీధిలో పద్మా పిక్చర్ ప్యాలెస్ ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన ఫ్యూజ్ కారియర్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఈ కారియర్ కిందికి ఉండడంతో పాటు దానికి ఉన్న మూత కూడా ఊడిపోయింది. దీంతో ప్రమాదంగా మారింది. ఎటువంటి ప్రమాదం జరగకముందే మూత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ సర్పంచి నాగేశం మాట్లాడుతూ వెంటనే ఇక్కడ మూత ఏర్పాటు చేయడంతో పాటు కాస్త ఎత్తుకు పెంచుతామని తెలిపారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

29న మహాజన సభ

వరదయ్యపాళెం : కడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ ఈనెల 29వ తేదీన ఉదయం 11గంటలకు వరదయ్యపాళెంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పర్సన్ ఇన్‌ఛార్జి అమరవేలు, సీఈవో సంపత్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు సంఘానికి సంబంధించిన ఆదాయ,వ్యయాల నివేదిక, ఆస్తులు, అప్పుల నివేదిక, వార్షిక పరిపాలన వ్యవహారాలు, బడ్జెట్ వంటి అంశాలపై సభ్యుల ఆమోదం కోరుతూ తీర్మానిస్తున్నట్లు తెలిపారు. సంఘంలోని సభ్యులు అదరు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నెల రోజులు ర్యాలీలు నిషేధం

శ్రీకాళహస్తి : జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు సబ్‌డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్టు అమల్లో ఉంటుందని డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. నెల రోజుల పాటు ఈ యాక్టు అమల్లో ఉంటుందని గురువారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ యాక్టు అమల్లో ఉన్నప్పుడు ర్యాలీలు, బహిరంగ సభలు, బందలు, మైక్ ప్రకటనలు నిషిద్ధమన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తెలిపారు.

అమల్లోకి పోలీసు యాక్ట్

రేణిగుంట : జిల్లాలో పోలీసు యాక్ట్ 30 అమల్లో ఉందని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల శ్రీవారి దర్శనార్థం ఇక్కడికి రానున్న నేపథ్యంలో ఈ యాక్ట్ ఉండడంతో రాజకీయం వేడెక్కింది. యాక్ట్ అమల్లో ఉన్నందున ఎక్కడ సభలు, మైకులు, సమూహంగా తిరగరాదని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల వారి సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

డిక్లరేషన్‌పై సంతకం చేయాల్సిందే

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి డిక్లరేషన్ చేశాక తిరుమలేశుని దర్శించుకోవాలంటూ తెదేపా బీసీ విభాగం నేతలు స్పష్టం చేశారు. స్థానిక కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో పలువురు నేతలు మాట్లాడుతూ డిక్లరేషన్ లేకుండా శ్రీవారిని దర్శించుకోవడం అంటే స్వామి వారిని అవమానించినట్లేనని ఆరోపించారు. జనం ఛీకొట్టినా వైకాపా నేతల తీరులో మార్పు రాకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో బీసీ విభాగం నేతలు రవి, ఉమేష్‌రావు, బుజ్జి, శివ, భాస్కర్, కృష్ణమూర్తి, వంశీ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని వికృతమాల పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. 2021 నుంచి పంచాయతీలో నిధులు పక్కదారి పట్టాయని స్థానికులు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీఎల్‌పీవో ప్రభురెడ్డి గురువారం వికృతమాలకు చేరుకుని పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పంచాయతీకి చేకూరిన ఆదాయం.. ఇప్పటి వరకు ఖర్చుచేసిన నిధుల వివరాల గురించి ఆరా తీశారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతే అక్రమాలు వెలుగులోకి వస్తాయని అధికారులు వివరించారు. దీంతో గతంలో ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శుల్లో ఆందోళన నెలకొంది.

మృతుడి తల్లికి చెక్కు అందజేత

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంటలోని ఆర్‌ఈ నివాస సముదాయం వద్ద ఇటీవల విద్యుత్ షాక్‌తో భరత్(26) అనే రైల్వే ఉద్యోగి మృతిచెందిన విషయం విదితమే. ఈ క్రమంలో గురువారం యూనియన్ నాయకులు మృతుని తల్లి పార్వతమ్మను కలిసి సంతాపం తెలిపారు. యూనియన్‌కు రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకోవడంతో మృతునికి రూ.2 లక్షల నష్ట పరిహారాన్ని చెక్కు రూపంలో పార్వతమ్మకు అందజేశారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడు సుదర్శన్ రాజు, రేణిగుంట బ్రాంచి కార్యదర్శి సురేష్, కార్యదర్శి గోపాల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో ఆదర్శంగా నిలవాలి

ఏర్పేడు, న్యూస్‌టుడే: పరిశుభ్రత పాటిస్తూ పల్లెలు ఆదర్శవంతంగా నిలవాలని తిరుపతి ఐఐటీ నోడల్ అధికారి ఆర్‌ఎస్‌కే చైతన్య తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మండలంలోని చిందేపల్లిలో గురువారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా చేసుకోవడంతో ఆరోగ్యవంతులుగా జీవనం సాగించవచ్చునని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఐఐటీ ఎస్ఎస్ఎస్ అధికారులు మహేష్, సుబ్బారెడ్డి, వెంకటరమణ, సర్పంచి పెంచలయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై ప్రణాళికలు సిద్ధం చేయాలి

సత్యవేడు, న్యూస్‌టుడే: ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 2024-2029 ఏడాదికి సంబంధించి మౌలిక వసతులపై పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం, స్వర్ణాంధ్ర 2047, మన ఇల్లు-మన గౌరవం, ఇది మంచి ప్రభుత్వం వంటి కార్యక్రమాలపై ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్, హరీష్, ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రంలో విధులు మహద్భాగ్యం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తిలో పురపాలక సంఘ కమిషనర్‌గా విధులు నిర్వహించడం మహద్భాగ్యంగా భావిస్తున్నట్లు గిరికుమార్ తెలిపారు. సాధారణ బదిలీల నేపథ్యంలో పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న ఆయనను ఉన్నతాధికారులు ఇక్కడ కమిషనర్‌గా నియమించారు. ఈ మేరకు గురువారం ఇక్కడి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతామని తెలిపారు. పురపాలక సంఘ పట్టణ ప్రణాళిక విభాగం అధికారి రమణారెడ్డి, డీఈ లలిత, పలువురు అధికారులు ఆయనను సత్కరించారు.



నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ గిరికుమార్‌ను సత్కరిస్తున్న పురపాలక సంఘ అధికారులు

రేషన్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు.. వరదయ్యపాళెం : మండలంలోని రేషన్ దుకాణాల్లో తూనికలు, కొలతలశాఖ అధికారులు గురువారం అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం ప్రజలకు అందించే నిత్యావసర సరుకుల తూకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకే తనిఖీలు నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్ తెలిపారు. మండలంలోని 43 చౌకదుకాణాల్లో యంత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు గణేష్, యోగేశ్, పెద్దబాబు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో ఇది మంచి ప్రభుత్వం .. నాగలాపురం: మండల కేంద్రమైన పిచ్చాటూరు గ్రామంలో తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతిబాబు అధ్వర్యంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కార్యక్రమ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తిరుమల రెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డిలు పాల్గొన్నారు. మండలంలోని కీళపూడిలో తెదేపా వాణిజ్య విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పద్మనాభ రాజు అధ్వర్యంలో కార్యక్రమాన్ని చేశారు.

ప్రజారోగ్యం లక్ష్యంగా సేవలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఫార్మాసిస్టులు అంకితభావంతో సేవలందిస్తారని ఫార్మాసిస్టుల సంఘం జిల్లా కార్యదర్శి, పట్టణ అధ్యక్షులు రాము, మధుసూదన్‌రావు సంయుక్తంగా అన్నారు. పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపం ఆవరణలో గురువారం ఫార్మాసిస్టు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఫార్మాసిస్టులను డ్రగ్గిస్టు అండ్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు గోపాల్, కార్తీక్‌రెడ్డి, జనార్దన్, ఆనంద్‌గుప్తాతో పాటు పలువురు ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి ఫార్మాసిస్టు వేడుకలు జరుపుకొంటున్న ఫార్మాసిస్టులు



ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను పరామర్శించిన మాజీ మంత్రి నారాయణస్వామి

కోనేటి పాడురంగం మృతికి మాజీ మంత్రి సంతాపం

నారాయణవనం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోదరుడు పాండురంగం బుధవారం గుండె పోటుతో మృతి చెందాడు. గురువారం మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి మండలంలోని భీమునిచెరువు గ్రామంలో పాండురంగం మృతదేహానికి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే ఆదిమూలం, జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్‌ను పరామర్శించి సంతాపం తెలిపారు. పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

ఇదెక్కడి నిర్లక్ష్యం..!

- మళ్లీ పడేస్తున్న వ్యర్థాలు
- ఇలాగైతే కష్టాలు పునరావృతం



సన్నిధివీధిని ఆనుకుని ఉన్న గొడ్డేరులో పదిహేను రోజుల క్రితం జేసీబీ సాయంతో మురుగును తొలగించిన వైనం

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి: వర్షాల దృష్ట్యా మురుగునీటి కాల్వలు ఎక్కడ పొంగి పొర్లకుండా వ్యర్థాల తొలగింపు చేపడుతున్నా మరో వైపు మళ్లీ వ్యర్థాలను వేస్తూ కాలువల రూపురేఖలను మార్చేస్తున్నారు. ప్రధానంగా సన్నిధివీధిని ఆనుకుని వెళ్లే గొడ్డేరు కాలువలో ఇదే పరిస్థితి. ఇటీవల పురపాలక శాఖ ఇంజినీరింగ్ శాఖ గొడ్డేరు పొడవునా వ్యర్థాలను శుభ్రం చేయించింది. అయినా మళ్లీ వ్యర్థాల గుట్టలు పేరుకుపోవడంతో అక్కడున్న నివాస గృహస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీకాళహస్తి పట్టణ వ్యాప్తంగా మురుగునీటి కాలువల్లో ఐదేళ్లుగా పూడికతీత చేపట్టిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, విజయవాడ జలప్రళయం నేపథ్యంలో అన్నీ పట్టణాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలంటూ పురపాలక శాఖ మంత్రి నారాయణ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసి రూ.59 లక్షలు నిధులు మంజూరు చేయించారు. దీంతో పట్టణంలోని అన్నీ పెద్ద కాల్వల్లో వ్యర్థాల తొలగింపు పనులు వేగవంతంగా జరిగాయి. వర్షాల్లోపు కాలువలు ఉప్పొంగి జన జీవనానికి ఇబ్బందులు లేకుండా చూడాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి పూడికతీత పనులు చేయించారు.



మళ్లీ కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాల గుట్టలు

కన్పించని శ్రద్ధ

ముక్కంటీశుని దర్శించుకోవాలంటే భక్తులు సన్నిధివీధి గుండా వస్తుంటారు. గతేడాది ఇక్కడి గొడ్డేరు ప్రధాన కాలువ స్తంభించడంతో వీధులన్నీ జలమయం అయ్యాయి. పరిస్థితి పునరావృతం కాకుండా చేపట్టాలన్న సంకల్పంతో జేసీబీ సాయంతో ఇక్కడి మురుగునీటి కాలువను శుభ్రం చేయించారు. కాలువ వెంట వాణిజ్య దుకాణాలు, వసతి గృహాలే. వ్యర్థాలను రోజువారి పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వకుండా వెనుక ఉన్న కాలువలో పడేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. శుభ్రం చేసి రోజులు గడవకముందే మళ్లీ వ్యర్థాలు చేరాయి. దీన్ని కట్టడి చేయకుంటే వర్షాకాలంలో మళ్లీ ఇక్కడి వీధులన్నీ జలమయం అయ్యే అవకాశముంది. నిబంధనలకు విరుద్ధంగా పడేసే వారికి జరిమానాలు విధించడం, ప్రజల్లో చైతన్యం కల్పించేలా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 70 నుంచి రూ. 90 వరకు
రెండో రకం: కిలో రూ. 50 నుంచి రూ. 70 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	122
లేయర్	144
బ్రాయిలర్స్	236
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	260
లేయర్ మాంసం	195

డిస్కంలో బదిలీలు

బాలాయపల్లి : స్థానిక విద్యుత్ శాఖ (డిస్కం) ఏఈ జహీర్ అహ్మద్ నెల్లూరుకు, జేఈ వేముల వెంకటాద్రి వెంకటగిరికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఇద్దరూ రిలీవయ్యారు. ఇక్కడకు జేఈగా గూడూరు నుంచి వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


నేడు గ్రామసభలు

తడ : స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047 సాధన కోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధంచేసేందుకు గురువారం గ్రామసభలు నిర్వహించనున్నామని ఎంపీడీవో విజయ్ కుమార్ తెలిపారు. గ్రామాల్లో ప్రజల అభిప్రాయాలు, సూచనలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు.

బొప్పాపురంలో జాతర

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని మూడో వార్డు బొప్పాపురంలో గురువారం పోలేరమ్మ జాతర నిర్వహించారు. పోలేరమ్మ ప్రతిమను తయారు చేసి భక్తులు దర్శనం కోసం ఉంచారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


పూలరథంపై అమ్మవారు


పుష్పాలంకరణ


మేడపై నుంచి వీక్షిస్తున్న జనం


క్యూలైన్లలో భక్తులు


కొబ్బరి కాయలు కొడుతూ..

జన జాతర

- కిక్కిరిసిన వెంకటగిరి వీధులు
- పోలేరమ్మకు మొక్కుల సమర్పణ
- లక్షలాది మంది భక్తుల నీరాజనం


భక్తుల అవస్థలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: శతాబ్దాల చరిత్ర కలిగిన వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర భక్త జనసందోహం మధ్యన గురువారం ముగిసింది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గురువారం రాత్రి పోలేరమ్మ తల్లిని ప్రత్యేక పూలాలంకరణతో చేసిన వాహనంపై అధిష్ఠించి పుర వీధుల్లో ఊరేగించారు. వీధుల్లో వేచి చూసి.. దర్శించుకుని పొలి టెంకాయలు సమర్పించారు. దాదాపు 1200 మంది పోలీసు బందోబస్తు మధ్యన జాతరను వైభవంగా నిర్వహించారు.

మట్టి కోసం ఎగబడ్డ పోలీసులు

విరూపణ తరువాత అమ్మవారి మట్టి కోసం పోలీసులే ఎగబడ్డారు. విరూపోత్సవం మండపం వద్దకు చేరుకోగానే పోలేరమ్మ ప్రతిమకు ఏర్పాటు చేసిన బంగారు ఆభరణాలను ఈవో శ్రీనివాసులు రెడ్డి స్వయంగా తొలగించి భద్రపరచి తీసుకువెళ్లారు. అనంతరం అమ్మవారి ప్రతిమను విరూపోత్సవం నిర్వహించారు. ప్రత్యేక పోలీసు బృందం అమ్మవారి ప్రతిమను చిందరవందర చేసి మట్టిని తీసుకున్నారు.

మొక్కులు తీర్చుకున్న రాజాలు

జాతరలో వెంకటగిరి సంస్థానంకు చెందిన యువరాజా సర్వజ్ఞ కుమార యాచేంద్ర, రాజకుటుంబీకుడు సత్యప్రసాద్ యాచేంద్ర పోలేరమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తరువాత వారి అనుచరులు సరవళ్లు తీసుకువచ్చి మొక్కులు చెల్లించారు. పట్టణంలోని పలువురు పోలేరమ్మకు మొలకలు, వేయికళ్ల దుత్తలను మొక్కులుగా సమర్పించారు.


పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు

ఏర్పాట్లపై అసంతృప్తి

తూర్పువీధి నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్‌పై భక్తులు మండిపడ్డారు. క్యూలైన్ ఇరుకుగా ఉండడం వల్ల పెద్దసంఖ్యలో దర్శనానికి వచ్చిన వారు ఇబ్బంది పడ్డారు. జీనిగలవారి వీధి నుంచి పోలేరమ్మ గుడి వద్దకు తీసుకువచ్చే క్రమంలో బంగారు పాదుక పడిపోయింది. పోలీసులు అప్రమత్తమై యథావిధిగా ఉంచారు.




అడుగడుగునా వైభవాలే..

జాతరలో అడుగడుగునా వైభవాలు స్పష్టంగా కనపడ్డాయి. జీనిగలవారి వీధిలో పోలేరమ్మ విగ్రహం వద్దిన తరువాత గాలిగాలిగా తీసుకువచ్చారు. ఆ సమయంలో విగ్రహం చుట్టూ పెద్ద సంఖ్యలో యువత చేరారు. వీరిని పంపకుండానే అలాగే ఉంచేసి దిష్టిచుక్క పెట్టారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఇక్కడ యువత అడ్డుగా ఉండడంతో వీరికి దర్శనం కరువైంది. ఇక్కడ విధులు నిర్వహించిన పోలీసు సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారు. సామాన్య ప్రజలే వందలాది మంది వీఐపీ మార్గంలో దర్శనానికి రావడంతో రూ. 300, రూ. 100 టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి దర్శనం సకాలంలో జరగకపోవడంతో ఆగ్రహించారు.

నిర్వహణకు రూ.50 లక్షలు మంజూరు

జాతరకు ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర పండుగ చేశారు తప్పిస్తే ఎక్కడా ఒక్క రూపాయి ఇచ్చిన దాఖలాలు లేవని మంత్రి అన్నారు. తెదేపా ప్రభుత్వం రాష్ట్రంలో ఆలయాలను బలోపేతం చేసేందుకు కసరత్తు చేసిందన్నారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. ఏటా రాష్ట్ర పండుగలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ మాట్లాడుతూ.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పోలేరమ్మను ప్రార్థించానన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. పోలేరమ్మ దయవల్ల రాష్ట్రంలో తెదేపా అత్యధిక సీట్లు గెలిచి అధికార పగ్గాలు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి సారె సమర్పించారు. ఆర్యవైశ్య మండపం వద్ద నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, హైకోర్టు న్యాయమూర్తి సుమలత, నెల్లూరు ఎస్పీ కృష్ణకాంత్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.




కలెక్టర్ వెంకటేశ్వర్‌కు రూ.50 లక్షల మంజూరు పత్రం అందిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. చిత్రంలో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే కురుగొండ్ల, ఎస్పీ సుబ్బరాయుడు

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:

సమస్య: సూళ్లూరుపేట పురపాలికలోని పాలవల్లివీధిలో కొత్తగా డ్రెయిన్ నిర్మించారు. అందులో మురుగు ముందుకు కదలడం లేదు. - **ఇబ్రహీం, పాలవల్లివారి వీధి**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి, పూడికతీత చర్యలు చేపడతాం. - **శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

నియామకం


విజయకుమార్

వాకాడు, న్యూస్‌టుడే: మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వాకాడు గ్రామానికి చెందిన జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్న దామా విజయకుమార్‌ను నియమిస్తూ గురువారం సాయంత్రం మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఎల్.రాజు నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ మేరకు విజయకుమార్ మాట్లాడుతూ దళితుల హక్కుల పరిరక్షణ కొరకు పోరాడి వాటి సాధనకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం విజయకుమార్‌ను పలువురు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ


ఫజులుల్లా

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘం కమిషనర్‌గా గురువారం ఫజులుల్లా బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆత్మకూరు కమిషనర్‌గా పని చేసి అక్కడి నుంచి ఇక్కడికి వచ్చారు. కార్యాలయం అధికారులతో మాట్లాడి ఇక్కడి ప్రధాన సమస్యలు తెలుసుకున్నారు.

ప్రతి నెలా పరీక్షలు చేస్తున్నారా?


వాకాడు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులకు ప్రతి నెలా ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తున్నారా.. పేదలకు మెరుగైన వైద్యం అందుతుందా..? అంటూ గురువారం వాకాడు మండలంలోని కొండాపురం గ్రామ సచివాలయం పరిధిలోని పలువురు పేదలను వైద్య ఆరోగ్య శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ అధికారులు ఆరా తీశారు. బాలింతలు, గర్భిణులను పరీక్షించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కమిటీ అధికారి శ్రీనివాసరావు, ఆరోగ్య శాఖ సూపర్వైజర్ నరేష్ బాబు, డీపీవో ప్రకాష్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో న్యాక్ కమిటీ తనిఖీ

కోట : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్సు అండ్ ఆర్ట్స్ కళాశాలను న్యాక్ పేర్ కమిటీ ప్రతినిధులు గురువారం సమగ్రంగా తనిఖీలు చేపట్టారు. కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్, శారద, ఎన్‌సీసీ ఆఫీసర్ గాదెశ్రీనివాస్ వివరాలను వారికి వెల్లడించారు. న్యాక్ కమిటీ ఛైర్మన్ రైసఖాన్, ప్రతినిధులు బాబాసాహెబ్ బీవ్రావ్, రాజ్‌కుమార్, గురుబుద్ధస్వామి కళాశాలలోని మౌలిక వసతులను పరిశీలించారు. గుణాత్మక విద్యపై ఆరా తీశారు. కళాశాలపై నివేదికను తయారు చేశారు.

రూ.2 లక్షల విరాళం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన విశ్రాంత ర.భ.వర్క్ ఇన్‌స్పెక్టర్ నాటకం రాజగోపాల్ అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడుని కలిసి అన్నక్యాంటీన్‌కు రూ.లక్ష, అమరావతి నిర్మాణానికి రూ.లక్ష మొత్తం.రూ.2 లక్షలు విరాళంగా అందజేసినట్లు గురువారం తెలిపారు. రాజగోపాల్ పెన్షన్ నగదు కొంత దాచిపెట్టి విరాళం అందించడంతో సీఎం అభినందించారని చెప్పారు. రాజగోపాల్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారని ఆయన తెలిపారు.


సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న రాజగోపాల్

ఉద్యోగ భద్రత కల్పించాలి

నాయుడుపేట, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధి కల్పించాలంటూ డివిజన్ పరిధిలో ఏపీఎస్‌బీసీఎల్ సెల్స్‌మెన్లు గురువారం మద్యం సరఫరా చేసే ఓజిలి డిపో వద్ద ఆందోళన చేపట్టారు. గత ప్రభుత్వం తమను మద్యం దుకాణాల వద్ద సెల్స్‌మెన్లు, పర్యవేక్షులుగా నియమించిందన్నారు. ప్రస్తుతం మద్యం దుకాణాలు ప్రైవేటు పరం చేసినందున తమకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. తమను ఉద్యోగ భద్రత కల్పిస్తామని కోరారు. నాయుడుపేట పెళ్లకూరు, ఓజిలి, చిట్టమూరు దొరవారిసత్రం మండలాల్లోని మద్యం దుకాణాలకు చెందిన సెల్స్‌మెన్లు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మద్యం దుకాణాల సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట గురుకులం విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో అండర్-19 విభాగంలో గురువారం బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు కావేరి, హంస, హ్యాండ్‌బాల్‌లో హారిక, పల్లవి, మష్విత, టెన్నీకాయిట్‌లో రజని, రగ్బీలో తేజస్విని, హాసిని, సెపక్‌తక్రాలో నవ్య, కావ్య, సుధ, కస్తూరమ్మ, మల్లిక, వెంకటరమణమ్మ, వాలీబాల్, త్రోబాల్‌లో భార్గవి, పల్లవిలు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపల్ రూత్‌రమోల, వైస్ ప్రిన్సిపల్ పద్మజ, వ్యాయామ ఉపాధ్యాయినిలు సుబ్బమ్మ, సుభాషిణిలు అభినందించారు.



నాయుడుపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పాల్గొన్న నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరుపట్టణంలోని సాధుపేట సెంటర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పంబలేరు వద్ద అసంపూర్తిగా ఉన్న ఓవర్‌బ్రిడ్జిని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వాటంబేటి శివకుమార్, దువ్వూరు రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ దుర్మరణం.. పెళ్లకూరు, న్యూస్‌టుడే: చిల్లకూరు వద్ద జాతీయ రహదారిపై ఆగిన ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ఘటనలో క్లీనర్ కార్తీక్(16) మృతి చెందాడు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన క్లీనర్ కార్తీక్ లారీలో తిరుపతి నుంచి నాయుడుపేట వైపు వెళ్తున్నాడు. చిల్లకూరు వద్ద ఆగిన ఉన్న లారీని వీరి లారీ ఢీకొట్టింది. కార్తీక్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ వినోద్‌కు తీవ్రగాయాలు కాగా తిరుపతిలో చికిత్స పొందుతున్నారు. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి.. దొరవారిసత్రం, న్యూస్‌టుడే: మండలంలోని నెలబల్లి సమీపంలో ఉన్న జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి గురువారం పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు రెండు మూడు రోజుల నుంచి నెలబల్లి పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నాడని, అతనికి మూర్ఛ వ్యాధి ఉన్నట్లు పోలీసులకు తెలిపారు. గురువారం తెల్లవారుజామున రహదారిపై నడుచుకుంటూ వెళుతూ మూర్ఛ వ్యాధి కారణంగా ముందుకు పడిపోయి ముక్కుభాగంలో తీవ్ర గాయమై మృతి చెందినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి.. కోట, న్యూస్‌టుడే: కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళేనికి చెందిన శివయ్య(35) ఈనెల 20వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. శివయ్య వరికోత యంత్రం కొనుగోలు చేశాడు. పలు ప్రాంతాల్లో పంటలను కోత కోసి వచ్చే ఆదాయంతో జీవనోపాధి పొందేవాడు. కోత కోయించుకొన్న వారు ఇవ్వవలసిన నగదు ఇవ్వలేదు. దీంతోపాటు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మానసికంగా ఇబ్బందులు పడుతూ ఈనెల 20న ఆత్మహత్యకు యత్నించాడు. నెల్లూరులో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు .. నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా పెద్దబయలు మండలం లక్ష్మీపేట గ్రామానికి చెందిన పంతాల వెంకటరావుని బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 4 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బాబి తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం.. పెళ్లకూరు : పెళ్లకూరు మండలం కలవకూరులో స్వర్ణముఖి నుంచి ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ని వీఆర్వో కల్యాణి పట్టుకున్నారు. ఇక్కడ నిఘా ఉన్నా అక్రమార్కులు చెలరేగుతున్నారు. స్థానిక రైతులు 100కి, టోల్ ఫ్రీకి ఫిర్యాదులు చేస్తున్నారు. అయినా ఇసుక కట్టడి కావడం లేదు. దీంతో ఇక్కడ ఉన్నతాధికారులు గట్టి నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో తొలగించిన సీసీ కెమెరాలు మళ్లీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రూ.12 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. నాయుడుపేట మునిరత్నంనగర్‌లో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమం చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రమణ్యం, పరిశీలకులు కొండలరావు, కమిషనర్ ఫజులుల్లా, మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, పుర వైస్‌ఛైర్మన్ షేక్.రఫీ, జనసేన ఇన్‌ఛార్జి ఉయ్యాల ప్రవీణ్, తెదేపా నాయకులు రాజేంద్ర, చంద్రారెడ్డి, సుబ్బారావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

- **సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** మన్నారుపోలూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విజయశ్రీ నిర్వహించారు. నేతలు టి.సుధాకర్‌రెడ్డి, ఎ.రమేష్, పి.సుబ్రహ్మణ్యం, ఏఆర్ కిషోర్, కాటయ్య, మునుస్వామి, భాజపా నేత ఆదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఇటీవల వరగలి అడ్డరోడ్డు సమీపాన ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

ఆగి ఉన్న లారీ.. ప్రాణాలు బలి

ఇటీవల వరుస ప్రమాదాలు

చిల్లకూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే లారీ చోదకులు సేదతీరేందుకు, ఇతర అవసరాల నిమిత్తం వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలిపేస్తున్నారు. వాహనాలు ఆగకుండా చేపట్టాల్సిన రక్షణ చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయి. అవి కాస్తా ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఎందరో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. చిల్లకూరు పరిధిలోని జాతీయ రహదారిపై ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలే ఇందుకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. మరమ్మతులకు గురైన, రహదారి పక్కన ఆపిన వాహనాలను గుర్తించి దూరంగా పెట్టిస్తే ప్రమాదాలను కొంత మేర నివారించే వీలుందని పలువురు వాహనచోదకులు పేర్కొంటున్నారు.

మచ్చుకు కొన్ని..

- బూదనం సమీపాన ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆర్నెల్ల కిందట టైరు పంక్చర్ కావడంతో రహదారి పక్కన నిలిపి మరమ్మతులు చేపట్టేందుకు డ్రైవర్ ఉపక్రమించారు. అంతలోనే వేగంగా వచ్చిన కారు బస్సును ఢీకొట్టడంతో బస్సు డ్రైవర్‌తోపాటు కారులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందారు.
- వరగలి అడ్డరోడ్డు కూడలి ప్రాంతంలో రెండు నెలల క్రితం జేసీబీ యంత్రాలను తరలించే లారీ చోదకులు వంట చేసుకునేందుకు వాహనాన్ని రహదారి పక్కన ఆపేశారు. సూళ్లూరుపేట నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు లారీని అదుపుతప్పి ఢీకొట్టింది. ఘటనలో మొక్కు తీర్చుకునేందుకు వెళ్తున్న తండ్రీ కూతుళ్లు ప్రాణాలు కోల్పోయారు.
- చిల్లకూరు పోలీసుస్టేషన్ ఎదురుగా రహదారి పక్కన ఆగి ఉన్న కంటైనర్ లారీని ఆరు రోజుల క్రితం కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తోపాటు తాత, మనవరాలి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.
- తాజాగా పెళ్లకూరు మండలం చిల్లకూరు వద్ద ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టింది. ఘటనలో క్లీనర్ మృతి చెందారు. రహదారి పక్కన నిలిపి ఉంచిన వాహనాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

నివారణ చర్యలు నామమాత్రం

ఏటా రహదారి భద్రత పేరిట రవాణా, పోలీసుశాఖలతో పాటు టోల్‌ప్లాజాల వారు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారే తప్ప, ప్రమాదాలను నివారించేందుకు చేపడుతున్న ముందస్తు చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయి. రహదారికి ఇరువైపులా హోటళ్లు, ఇతర దుకాణాలు ఉండటంతో వాహనచోదకులు రోడ్డుపైనే వాహనాలను ఆపి తమ పనులను చక్కబెట్టుకుంటున్నారు. వీరిని వారించే వారే లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఉద్యోగ మేళా సద్వినియోగం చేసుకోవాలి.. గూడూరు పట్టణం: నిరుద్యోగులు ప్రభుత్వం నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. గూడూరు పట్టణంలోని కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకి గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. 47 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారు.

నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి.. గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని దుబాయికి చెందిన ప్రముఖ వక్త బి.పూజ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. కళాశాల డీన్ రాజయ్య, ఏవో రామయ్య, ప్రిన్సిపల్ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

గూడూరు పట్టణం : పట్టణంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల వద్ద భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా గురువారం రక్తదానం శిబిరం నిర్వహించగా. . కళాశాల విద్యార్థులు చేశారు. జిల్లా భాజపా అధ్యక్షుడు చంద్రప్ప మాట్లాడుతూ విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవడం సంతోషకరమని తెలిపారు. నాయకులు మనోజ్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రకాశ్‌నాయుడు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు నిత్యావసరాలు అందిస్తున్న నాయకులు

నిత్యావసరాల పంపిణీ

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న పేదలకు సేవ చేయడం మానవతా దృక్పథమని, ప్రతి ఒక్కరు సమాజంలో సేవా భావంతో ముందుకు సాగాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య నాయకులు తెలిపారు. పట్టణంలోని బ్రాహ్మణ భవనంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఆలూరు శిరోమణిశర్మ, కనుమెల సుబ్బారావు దాతృత్వంతో గురువారం నిత్యావసరాలు అందజేశారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు ఎ.శివకుమార్, కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రతినిధులు శ్రీనివాస్, పురుషోత్తం, నరసింహరావు, వెంకటేశ్వరరావు, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.